ఈనాడు హైదరాబాద్

HMDA

బుధవారం 23 ఆగస్టు 2017 | 24 పేజీలు



రెడ్డిహాస్టల్ భవన సముదాయానికి శంకుస్థాపన చేసేందుకు మంగళవారం బుద్వేల్‌కు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెరాస శ్రేణులు, రెడ్డి సంక్షేమ సంఘ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. జన సందోహం, వాహనాలతో స్థానికంగా రహదారులు కిక్కిరిశాయి. పలువురు మంత్రులు, అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

అయిదేళ్లుగా దాగాడు..

పేరు మార్చినా దొరికాడు



గోవింద్ సల్గోంకర్

- సీబీఐ సమాచారంతో ఘరానా నేరస్థుడి అరెస్టు

ఈనాడు, హైదరాబాద్

గోవింద్ సల్గోంకర్.. ముంబయి నివాసి. ఆర్థిక నేరాలకు పాల్పడటంలో దిట్ట. ముంబయి.. దిల్లీ.. కోల్‌కతాలో ఎగుమతులు.. దిగుమతుల వ్యాపారం ముసుగులో నకిలీ బ్యాంకు గ్యారెంటీ పత్రాలు సమర్పించి బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టడం, అవసరమైన వారికి కమీషన్ పద్ధతిలో లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను ఇస్తుంటాడు. పదిహేనేళ్ల నుంచి ఇదే దందా. తమకూ తప్పుడు హామీ పత్రాలిచ్చారంటూ దీపక్ కుడేషియా, గోవింద్ సల్గోంకర్‌పై హైదరాబాద్‌కు చెందిన క్యోరీ ఒరిమన్ సంస్థ గతంలో ఫిర్యాదు చేసింది. ఐదేళ్ల క్రితం సీసీఎస్ పోలీసులు అతడిని అరెస్ట్ చేసేందుకు వెళ్లినా దొరకలేదు. నిందితుడు ఇక దొరకడేమో అనుకునే దశలో మళ్లీ కేసు వెలుగులోకి వచ్చింది. అనిల్ శివాజీరాం సావంత్‌గా పేరు మార్చుకుని జీవిస్తున్న గోవింద్‌ను అరెస్ట్ చేశారు. సీబీఐ అధికారుల సహకారంతో ఆచూకీ గుర్తించి నాలుగునెలల పాటు నిఘా ఉంచి అదుపులోకి తీసుకున్నామని డీసీపీ అవినాష్ మొహంతి తెలిపారు. ఇతడిచ్చిన సమాచారం ఆధారంగా ఇతర నిందితులను పట్టుకొనేందుకు ప్రత్యేక ...మిగతా 4లో

దారులు

ధ్వంసమే!

- ఇంకుడు గుంతలు, నిల్వ ట్యాంకులు లేవు
- వర్షపునీటిని రోడ్డుపైకి వదిలేలా మెట్రో పైపులైన్లు



ఈనాడు, హైదరాబాద్

అసలే అంతంతమాత్రంగా ఉన్న గ్రేటర్ రహదారులకు మరో ముప్పు వచ్చింది. రోడ్లు ఎలా ఉంటే మాకేంటి.. రైలు మార్గం బాగుంటే చాలనేలా ఎల్‌అండ్‌టీ వ్యవహరిస్తోంది. మెట్రో రైల్వే లైన్‌పై కురిసే వర్షపు నీటిని పైపులైన్ల ద్వారా రోడ్డుపైకి వదిలేయబోతోంది. ఇందువల్ల మున్ముందూ గుంతల రోడ్లే దర్శనమిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మెట్రో రైలు మార్గంపై కురిసే వర్షపునీటిని పైపులైను ద్వారా రోడ్డుపైకి చేరేలా ఎల్‌అండ్‌టీ ఏర్పాట్లు చేసింది. ఈ నీరు రోడ్లను ధ్వంసం చేస్తుందని సీనియర్ ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు మెట్రో పనుల కారణంగా ప్రధాన రహదారులు ఎలా గుంతలమయం అయ్యాయో.. ...మిగతా 4లో

ఇద్దరు రౌడీషీటర్లకు ఆరేళ్ల జైలు

● నిందితుల్లో ఒకరిపై ఇప్పటికే పీడీ చట్టం



లక్ష్మణ్



మహ్మద్ బిన్ ఖలిద్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు ఆరేళ్ల జైలు శిక్షతోపాటు వేయి రూపాయల అపరాధ రుసుం విధించింది. ఈ ఇద్దరూ జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో రౌడీషీటర్లు కావడం గమనార్హం. గతేడాది ఆగస్టులో 15న కార్మికనగర్ ప్రాంతంలో నివసించే టెంట్‌హౌజ్ వ్యాపారి సురేష్‌కుమార్‌ను డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. నిరాకరించడంతో మహ్మద్ బిన్ ఖలిద్ వ్యాపారిని బెదిరించి అతని చొక్కా పట్టుకోగా అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ కొడాలి లక్ష్మణ్ అతని జేబులోంచి బలవంతంగా డబ్బులు లాక్కొన్నాడు. సురేష్ కుమార్ వారిద్దరిపై ఫిర్యాదు చేశారు. అప్పటికే లక్ష్మణ్‌పై పలు కేసులు ఉండటంతో అతన్ని పీడీ చట్టం కింద అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను చంచల్‌గూడ జైలులో శిక్షను అనుభవిస్తున్నాడు. ఖలిద్ కూడా ఓ హత్య కేసులో ప్రస్తుతం చంచల్‌గూడ జైలులోనే ఉన్నారు. బెదిరించి డబ్బులు వసూలు చేసిన కేసును విచారించిన నాంపల్లిలోని 17వ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు మెజిస్ట్రేట్ బి.శ్రీనివాసరావు వీరిద్దరికి ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వేయి చొప్పున నగదు చెల్లించాలని తీర్పునిచ్చారు. నిందితులకు శిక్ష పడేలా చేయడంలో సాక్ష్యాలు సమకూర్చిన జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ సామల వెంకటరెడ్డి, ఎస్సై సత్తయ్య, కోర్టు కానిస్టేబుల్ వరప్రసాద్‌లను డీసీపీ వెంకటేశ్వర్‌రావు, ఏసీపీ నోముల మురళి అభినందించారు.

కన్నతండ్రిని జైలుపాలు చేసిన మమకారం

మల్కాజిగిరి: కొడుకుపై మమకారం కన్నతండ్రిని జైలుపాలు చేసింది. పేదరికంతో కొడుకు పోషణ భరించలేక తన అత్తమామలకు అప్పగించిన ఓ తండ్రి జీవితంలో కుదురుకున్న తరువాత తెచ్చుకోవాలనుకున్నాడు. కానీ పెంచిన మమకార బంధానికే న్యాయస్థానం మొగ్గు చూపించి. పిల్లవాడ్ని వారి వద్దనే ఉంచాలని తీర్పు ఇచ్చింది. తీర్పును ధిక్కరించి కొడుకును ఇంటికి తెచ్చుకోవాలనే తండ్రి తపన అతడ్ని జైలుకు పంపింది. మల్కాజిగిరి పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై రమేష్ కథనం ప్రకారం.. నేరేడ్‌మెట్‌కు చెందిన జి.కిషోర్ (35), గౌతంనగర్‌కు చెందిన సంధ్యారాణి 2008లో ప్రేమవివాహం చేసుకున్నారు. కిషోర్ కారుడ్రైవర్. వారికి కొడుకు అనంతసాయి (8) ఉన్నాడు. కిషోర్‌కు ఆదాయం తక్కువగా ఉండటంతో అనంతసాయిని గౌతంనగర్‌లో నివసించే అత్తమామలు పద్మావతి, వెంకటాచారిలకు ఇచారు. వెంకటాచారి విశ్రాంతి రైల్వే ఉద్యోగి. కొన్నేళ్ల తరువాత అతని ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో కొడుకును తెచ్చుకునేందుకు ప్రయత్నించినా పెద్దలు అంగీకరించలేదు. మనవడి భవిష్యత్తు ఏమవుతోందనే భయంతో వెంకటాచారి 2016లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అనంతసాయి తాత వద్దనే పెరగాలని 2017 జూన్‌లో తీర్పు ఇచ్చింది. అప్పటి నుంచి బాలుడు తాత ఇంట్లోనే ఉంటున్నాడు. కోర్టు తీర్పును ఉల్లంఘించిన కిషోర్.. తన కొడుకును బలవంతంగా ఇంటికి తెచ్చుకున్నాడు. వెంకటాచారి మల్కాజిగిరి పోలీసులను జులైలో ఆశ్రయించారు. పోలీసులు కిషోర్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



ప్రమాదం అంచున ప్రయాణం

వాహనంలో తరలిస్తున్న భవనాలకు సంబంధించిన ఇనుప చువ్వలపై నలుగురు వ్యక్తులు కూర్చున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని రోడ్లు దెబ్బతిన్నాయి. గుంతల్లో వ్యాన్ కుదుపులకు చువ్వలతో వారికి ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది. ఇలా దోమలగూడలోని రామకృష్ణ మఠం రోడ్డులో ప్రయాణించింది

ప్రేమ పేరుతో బాలికకు వేధింపులు

● యువకుడి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

నాగోలు, న్యూస్‌టుడే: ఓ పదిహేనేళ్ల బాలికను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నర్సింహ కథనం ప్రకారం... ఎన్టీఆర్‌నగర్‌లో నివసిస్తున్న యాకుబ్(20) జులాయిగా తిరుగుతుంటాడు. స్థానికంగా ఉండే ఓ బాలిక(15) వెంట పడుతూ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోవాలంటూ వేధిస్తున్నాడు. ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడుతున్నాడు. సోమవారం బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మంగళవారం యాకుబ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ భుజంగరావు

కేపీహెచ్‌బీకాలనీ: ఇళ్లలో, జేబు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టుచేశారు. మంగళవారం ఠాణాలో కూకట్‌పల్లి ఏసీపీ ఎన్.భుజంగరావు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా చేబ్రోలుకి చెందిన మండల ఇంద్రసేనారెడ్డి అలియాస్ నాని(27) ప్రగతినగర్‌లో నివాసముంటూ గతంలో కేపీహెచ్‌బీ చుట్టుపక్కల ఠాణా పరిధిలో ఇళ్ల తాళాలు పగలుకొట్టి దొంగతనాలకు పాల్పడి జైలుపాలయ్యాడు. జైలునుంచి వచ్చిన తర్వాత కూడా చోరీలకు పాల్పడుతున్నాడు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నానితో పాటు మరో ఇద్దరు జేబుదొంగలు వేర్వేరు చోట్ల అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కర్ణాటకకు చెందిన సయ్యద్ తాజుద్దీన్(28) జగద్గిరిగుట్టలో, షేక్‌బాబా932) బోరబండలో కొంతకాలంగా నివాసముంటూ నగరంలో పలుచోట్ల బస్టాండ్‌లు, ఆర్టీసీ బస్సులు, రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికుల జేబుల్లోనుంచి సెల్‌ఫోన్లు, పర్సులు దొంగిలిస్తున్నారు. తొమ్మిది చోరీలకు సంబంధించి వీరిరువురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముగ్గురినుంచి దాదాపు రూ.4లక్షల విలువైన 4 ద్విచక్రవాహనాలు, బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు, నగదుని పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ కుశాల్కర్, డీఐ బాలకృష్ణ, ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

బాలానగర్, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ పి.భిక్షపతిరావు కథనం ప్రకారం.. నవజీవన్‌నగర్‌కు చెందిన బి.లత(24), రాజుకు 9ఏళ్ల కిందట పెళ్లి జరిగింది. ఇద్దరూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త ప్రతి రోజు రోజు మద్యం తాగొచ్చి అనుమానిస్తూ భార్యను తిట్టి, బాగా కొట్టేవాడు. సోమవారం రాత్రి ఇంటికొచ్చిన రాజు రూ.9వేలు ఇచ్చి ఫైనాన్స్‌లో కట్టిరావాలని చెప్పగా లత వెళ్లి రూ.8,750కట్టి వచ్చింది. రూ.250 ఏం చేశావంటూ ఆమెను కొట్టాడు. ఈ క్రమంలో ఆమె సమీపంలోని పెట్రోల్‌బంక్‌కు వెళ్లి రూ.50 పెట్రోల్ కొనుగోలు చేసుకొని వచ్చింది. మళ్లీ ఇంటికొచ్చి పిల్లలను తీసుకొని తల్లిదండ్రుల వద్దకు వెళుతుండగా భర్త అడ్డుకొని పిల్లలను తీసుకొని మళ్లీ తనఇంటికి రావద్దని ఆమెకు చెప్పాడు. దీంతో ఆమె పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. స్థానికులు మంటలు ఆర్పి హుటాహుటిన గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి 2గంటల తర్వాత మృతిచెందింది. ఆమెనుంచి మరణ వాంగ్మూలం నమోదు చేసిన పోలీసులు రాజుపై కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రోరైల్ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

● మహిళ నుంచి రూ.9 లక్షలు దండుకున్న వైనం

నాగోలు, న్యూస్‌టుడే: మెట్రో రైల్ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ మహిళ వద్ద రూ.9 లక్షలు తీసుకొని మోసం చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఎల్బీనగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై నర్సింహ కథనం ప్రకారం... కర్మన్‌ఘాట్‌లో నివసించే సుమతికి ఏడాది క్రితం లెనిన్‌నగర్‌లో నివసించే స్థిరాస్తి వ్యాపారి సుధాకర్(45) పరిచయమయ్యాడు. భూ సంబంధిత సమస్యలు తీరుస్తానని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. తనకు తెలిసిన మోహన్‌రావు ద్వారా మెట్రో రైల్ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానంటే సుమతి నమ్మింది. ఏడాదిక్రితం సుధాకర్ సమక్షంలో మోహన్‌రావుకు రూ.9 లక్షలు నగదు ముట్టచెప్పింది. అయినా ఉద్యోగం ఇప్పించకపోగా.. తన డబ్బులు సైతం తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయానని గుర్తించిన సుమతి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం నిందితుడు సుధాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మరికొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కళాంజలిలో చందేరి కుర్తా నయా కలెక్షన్స్



ఈనాడు, హైదరాబాద్

కళాంజలిలో ఈతరం మెచ్చే సరికొత్త వస్త్ర కలెక్షన్లు వచ్చాయి. వానాకాలంలో ధరించడానికి అనువైన.. మరెక్కడా దొరకని డిజైన్లతో పెటిట్ బ్లాసమ్ వస్త్రశ్రేణిని తీసుకొచ్చింది. పక్షులు, పువ్వుల ఎంబ్రాయిడరీ, ప్రింట్స్‌తో ఇవి ఎంతో స్టైలిష్‌గా ఉన్నాయి.

చందేరి కుర్తాపై పాస్టల్ ఫ్లోరల్ ఎంబ్రాయిడరీ, యోక్ వద్ద పిన్‌టక్ డిటైల్‌తో రూపొందిన వస్త్రాలు ఎంతో నాజూగ్గా ఉన్నాయి. ముదురు ఎరుపు, ఆకుపచ్చ రంగుల్లో ఈ డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. వివరాలకు www.kalanjali.com, www.facebook.com/kalanjaliworld సందర్శించండి.

చందా దందాలపై పోలీసు నజర్

బలవంతపు వసూళ్లపై సమాచార సేకరణ



ఈనాడు, హైదరాబాద్

గణేశ్ ఉత్సవాల సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠ, నిమజ్జనం రోజు ఖర్చులంటూ చందాల పేరుతో బలవంతపు వసూళ్లపై పోలీసులు దృష్టి సారించారు. గణేశ్ పేరు చెప్పి రూ.వేల చొప్పున నగదు చెల్లించాలంటూ డిమాండ్ చేస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షించేందుకు ఆధారాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పోలీసులు గణేశ్ మండప నిర్వాహకులతో మాట్లాడి ఎవరూ బలవంతంగా వసూలు చేయకూడదంటూ సూచించారు. మఫ్టీలో పోలీసులను నియమించి విచారిస్తున్నారు. ఎవరైనా సరే వసూళ్లకు పాల్పడుతుంటే సంబంధిత పోలీసు ఠాణా అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకురావాలని తెలిపారు. వీరిపై సిటీ పోలీస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయనున్నామన్నారు.

గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించి ఆ ముసుగులో వసూళ్లకు పాల్పడుతున్న రౌడీషీటర్లు, వారి అనుచరులను కట్టడి చేసేందుకే పోలీస్ ఉన్నతాధికారులు కాలనీలు, గల్లీల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు కాలనీలు, గల్లీల్లోని ఇళ్లకు వెళ్లి చందాలు వసూలు చేస్తున్నారా? ఎవరికి ఎంత ఇచ్చారు? డబ్బు ఇవ్వకపోయినా రసీదులు ఇచ్చి వెళ్లారా? అన్న వివరాలను సేకరిస్తున్నారు. ప్రధానంగా పశ్చిమమండలం, పాతబస్తీలో కొందరు రౌడీషీటర్లు తెరవెనుక ఉండి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నారు. మండప నిర్వాహకులుగా వారి అనుచరులను తెరపై ఉంచుతున్నారు. చందాల పేరుతో రౌడీషీటర్ల అనుచరులు ఆయా ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి చందాలు చెల్లించాలంటూ బెదిరింపు వైఖరితో చెబుతున్నారు. పోలీసులకు చెబితే దాడి చేస్తారన్న భయంతో బాధితులు ఈ విషయాన్ని బహిర్గతం చేయడం లేదు. పాతబస్తీలో చార్మినార్, చాంద్రాయణగుట్ట, శాలిబండ, మొగల్‌పురా, డబీర్‌పురా, మాదన్నపేటతో పాటు పశ్చిమ మండలంలో టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్, షాహినాయత్‌గంజ్, కుల్సుంపురా, పంజాగుట్ట పోలీస్‌ఠాణాల పరిధుల్లో ఈ చందాల దందాలు అధికంగా జరుగుతున్నట్లు గుర్తించారు.

మైత్రీ కమిటీలతో సమావేశాలు

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా పూర్తయ్యేందు, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు కాలనీ సంఘాలు, మైత్రీ కమిటీలతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో చందాల వసూళ్లపై వివరాలను సేకరించడంతో పాటు ఎవరైనా ప్రత్యక్షంగా పరోక్షంగా బెదిరిస్తున్నారా? అని ఆరా తీస్తున్నారు. సంఘ విద్రోహ శక్తులు, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఎవరైనా ప్రవరిస్తున్నారా? సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు వస్తున్నాయా? అన్న వివరాలను తెలుసుకుంటున్నారు. గణేశ్ ఉత్సవాలకు సంబంధించి తొలిరోజు నుంచి నిమజ్జనం వరకూ రోజువారీ వ్యవహారాల వివరాలను, కొన్ని సందర్భాల్లో జమా ఖర్చులను పోలీసులకు వివరించాలని సూచించారు.



నోరూరించిన ఆహారోత్సవం

సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్‌లో మంగళవారం నిర్వహించిన హాట్ అండ్ జ్యూసీ కబాబ్ ఫెస్టివల్ అతిథులను ఆకట్టుకుంది. చెఫ్ విజయ్ ఆనంద్ బక్షి తయారు చేసిన కబాబ్‌లు భోజన ప్రియుల నోరూరించాయి.

రెడ్డి హాస్టల్లో చదివిన వారు ఉన్నత స్థాయికి ఎదిగారు

శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి స్థాపించిన రెడ్డి హాస్టల్‌లో విద్యను అభ్యసించిన వారు ఉన్నత పదవుల్లో ఉన్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్‌లోని బుద్వేల్‌లో రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీకి కేటాయించిన 10 ఎకరాల స్థలంలో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి హాస్టల్ పేరుతో స్థాపించినా ఇక్కడ అన్ని వర్గాల ప్రజలకు విద్యను అందించడానికి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. 30శాతం మంది ఇతర కులాలకు చెందిన వారికి సీట్లు కేటాయిస్తున్నారని అన్నారు. ఇక్కడ చదువుకున్న వారు దేశప్రధాని కావడంతో పాటు మరెన్నో ఉన్నత స్థానాలు సాధించారని చెప్పారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... రాజబహద్దూర్ వెంకటరామారెడ్డి విద్యా, వైద్యం, వ్యవసాయంపై కృషి చేశారని అన్నారు. రెడ్డిహాస్టల్‌తో కొండారంగారెడ్డికి అనుబంధం ఉందని, రంగారెడ్డి జిల్లాలోని బుద్వేల్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఇలాంటి విద్యాసంస్థలు రావడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ వసతిగృహాలలో సన్న బియ్యం ఇచ్చిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. నియోజకవర్గంలో 111 జీవో సమస్యగా మారిందని, రద్దు చేసే దిశగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. మైలార్‌దేవ్‌పల్లిలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎమ్మెల్యే అందజేశారు.



సందడిగా స్వాగతోత్సవం





రామంతాపూర్‌లోని మేఘ ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు మంగళవారం నాగోలులోని నిమంత్రణ్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకల్లో సందడి చేశారు. ఫ్యాషన్‌షో, నృత్యాలు, గీతాలు, ప్రదర్శనలతో ఉర్రూతలూగించారు. మేఘ, ఒమేగా విద్యాసంస్థల ఛైర్మన్ నాగం మోహన్‌రెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ కసిరెడ్డి మాలతీరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో 2016-17 విద్యా సంవత్సరంలో తమ కళాశాల విద్యార్థులు సుమారు 500 మంది ప్రముఖ కార్పొరేట్ సంస్థల ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సీతారాంరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సావిత్రి పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, నాగోలు

● నిర్వహణకు నగర ట్రాఫిక్ పోలీసుల వెనుకడుగు

● వచ్చే నెల 15న టెండర్ల ఖరారు

● కాచిగూడ రైల్వే స్టేషన్‌లో తీరనున్న ప్రయాణికుల వెతలు



కాచిగూడ రైల్వే స్టేషన్

ప్రీపెయిడ్ ఆటో.. విజయవంతమయ్యేనా?

● *కూకట్‌పల్లికి చెందిన శ్రీనివాస్‌రావు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. వివాహ వేడుకల్లో పాల్గొనడానికి కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూర్ నుంచి రైలులో కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. కూకట్‌పల్లి వెళ్లడానికి రావాలని ఆటోవాలాలను కోరగా మీటర్ ఛార్జీపై రావడానికి వారు నిరాకరించారు. దీంతో అతను వారు డిమాండ్ చేసినంత డబ్బు చెల్లించి ఆటోలో వెళ్లాడు.*

● *పాతబస్తీ బార్కాస్‌కు చెందిన పండ్ల వ్యాపారి మహమ్మద్ మునావర్ చెన్నైలోని తన చెల్లెలును తీసుకుని రైలులో కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. బార్కాస్‌కు రావాలని ఆటో డ్రైవర్లను కోరితే వారు అందుకు నిరాకరించారు. కోరినంత డబ్బు ఇస్తామన్నా కూడా వారు ససేమిరా అనడంతో లగేజీతో ఆర్టీసీ బస్సులో వెళ్లాల్సి వచ్చింది.*

న్యూస్‌టుడే, కాచిగూడ

కాచిగూడ రైల్వే స్టేషన్ ఆవరణలో నగరవాసులతోపాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల వారికి ఆటో డ్రైవర్లతో ఇలాంటి సమస్యలు నిత్యం తలెత్తుతున్నాయి. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయడానికి కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటోను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండేళ్ల క్రితం నగర ట్రాఫిక్ డీసీపీ రంగనాథ్, రైల్వే అధికారులతో కలిసి కాచిగూడ రైల్వే స్టేషన్ ఆవరణను పరిశీలించారు. ప్రీపెయిడ్ ఆటో పార్కింగ్ ఏర్పాటుకు రిజర్వేషన్ కాంప్లెక్స్ పక్కనున్న ప్రాంతంలోని స్థలాన్ని ఎంపిక చేశారు. రైల్వే అధికారులు టెండర్ ద్వారా ప్రీపెయిడ్ ఆటో పార్కింగ్ నిర్మించి నాలుగు నెలలు కావస్తోంది. కాచిగూడ రైల్వే స్టేషన్ ఆవరణలో 500 వరకు ఆటోలు ఉంటేనే నిర్వహణ సాధ్యమని ట్రాఫిక్ పోలీసులు వెనుకడుగు వేశారు. దీంతో ప్రీపెయిడ్ ఆటో పార్కింగ్ ప్రారంభం వాయిదా పడింది. ఎట్టకేలకు దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ వాణిజ్య విభాగం అధికారులు గత వారం ప్రీపెయిడ్ ఆటో నిర్వహణ కోసం బహిరంగ టెండర్లను ఆహ్వానించారు.

40 వేల మంది ప్రయాణికులు

నగరంలోని ముఖ్యమైన రైల్వే స్టేషన్లలో కాచిగూడ ఒకటి. కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి ఇంటర్‌సిటీ అకోలా, చెన్నై ఎగ్మోర్, బెంగళూర్, వెంకటాద్రి, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు, మంగళూర్, మధురై, నాగర్‌కోయిల్ వారాంతపు, టాటానగర్, కాకినాడ ప్రత్యేక రైళ్లు, కొంగు, వైనగంగ, ఏపీ, కర్ణాటక సంపర్క్‌క్రాంతి, ఇండోర్, లక్నో, నాగర్‌సోల్, మైసూర్-జైపూర్, ఓఖా-రామేశ్వరం తదితర వాటితోపాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ఎక్స్‌ప్రెస్‌లు, మహబూబ్‌నగర్, కర్నూలు, గుంటూరు, గుంతకల్లు, రాయచూర్, నాందేడ్, గుల్బర్గా, నిజామాబాద్, మిర్యాలగూడ తదితర ప్యాసింజర్, ఎంఎంటీఎస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. వీటి ద్వారా ప్రతి రోజు 40 వేల మందికి పైగా ప్రయాణికులు తమ తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. వారాంతాలు, సెలవు రోజులు, పండుగ దినాల్లో ప్రయాణికుల సంఖ్య 50 వేలు దాటుతుంది. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులతో పాటు వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితుల సంఖ్య కూడా వేలల్లో ఉంటుంది. కొందరు ప్రయాణికులు సొంత వాహనాల్లో, మరికొందరు ఆర్టీసీ బస్సుల్లో, ఇంకొందరు ఆటోలలో కాచిగూడ స్టేషన్‌కు, ఇక్కడి నుంచి నగరంలోని తమ తమ ఇళ్లకు వెళుతుంటారు.

అధికంగా డబ్బు డిమాండ్

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి నగరానికి కొత్త వచ్చే ప్రయాణికుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆటోవాలాలు వారి నుంచి అధికంగా డబ్బు డిమాండ్ చేస్తున్నారు. మీటర్ రీడింగ్‌పై రావడానికి వారు నిరాకరిస్తున్నారు. ప్రయాణికులు కోరిన కొన్ని ప్రాంతాలకు రావడానికి ఆటో డ్రైవర్లు ససేమిరా అంటున్నారు. తమకు అనువైన ప్రాంతాలు, డిమాండ్ చేసిన డబ్బు ఇవ్వడానికి ప్రయాణికులు ముందుకొస్తేనే వారిని ఆటోలో తీసుకెళుతున్నారు. లగేజీ, వృద్ధులు, పిల్లలు, మహిళల కారణంగా చాలా మంది ప్రయాణికులు ఆటో డ్రైవర్లు అడిగినంత డబ్బు ఇచ్చి నగరంలోని తమ తమ ఇళ్లకు చేరుకుంటున్నారు. దీనిపై కాచిగూడ ట్రాఫిక్ పోలీసులకు గతంలో ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఆటోవాలాల అక్రమాలకు అరికట్టడానికి ప్రీపెయిడ్ ఆటో స్టాండు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండేళ్ల క్రితం ట్రాఫిక్ డీసీపీ రంగనాథ్‌తోపాటు దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ అధికారుల బృందం కాచిగూడ రైల్వే స్టేషన్‌ను సందర్శించి ప్రీపెయిడ్ ఆటో నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేశారు.



రైల్వే స్టేషన్ ఆవరణలో నిర్మించిన ప్రీపెయిడ్ ఆటో పార్కింగ్

రూ. 5 అదనంగా వసూలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రీపెయిడ్ ఆటో ఏర్పాటు చేసి నిర్వహణను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. వారు ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ. 2 నిర్వహణ ఖర్చుల కోసం అదనంగా వసూలు చేసేవారు. ప్రీపెయిడ్ ఆటో నిర్వహణ సిబ్బంది జీతాలు, కంప్యూటర్లు తదితర వాటికి ఈ డబ్బు సరిపోవడం లేదని చెప్పడంతో దీన్ని రూ. 3 లకు పెంచారు. అయినా తమకు గిట్టుబాటు కావడంలేదని ప్రైవేట్ వారు చేతులెత్తేయడంతో సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో నిర్వహణకు రైల్వే సికింద్రాబాద్ డివిజన్ వారు టెండర్లను పిలిచినట్లు సమాచారం. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు నిత్యం 350-400 వరకు మాత్రమే ఆటోలు వస్తున్నాయని తమ సర్వేలో తేలిందని, 500 లకుపైగా ఆటోలు ఉంటేనే ప్రీపెయిడ్ ఆటో నిర్వహణ సాధ్యమని ట్రాఫిక్ పోలీస్ విభాగం అధికారులు చేతులెత్తేశారు. దీంతో రైల్వే హైదరాబాద్ డివిజన్ అధికారులు గత వారం కాచిగూడ రైల్వే స్టేషన్ ప్రీపెయిడ్ ఆటో నిర్వహణకు టెండర్లను పిలిచారు. వచ్చే నెల 15న టెండర్లు ఖరారు కానున్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రీపెయిడ్ ఆటో నిర్వహణ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ డివిజన్ వాణిజ్య విభాగం అధికారులు ఆటో ఛార్జీలకుతోటు అదనంగా రూ. 5 నిర్వహణ ఖర్చు కింద కాచిగూడ స్టేషన్‌లో ప్రయాణికులు చెల్లించాలని నిర్ణయించారు.

సమాచార వాహిని

మార్గదర్శి చిట్టి గ్రూపుల వివరాలివీ

హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్ మియాపూర్ బ్రాంచిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న చిట్టి గ్రూపుల వివరాలు ఇలా ఉన్నాయి. అదనపు సమాచారం కోసం బి.ఎస్.వి.ఎస్.ఎస్.వి. ప్రసాద్, బ్రాంచి మేనేజరు, మియాపూర్‌ను సంప్రదించవచ్చు. ఫోన్ నెంబర్లు: 040-23449315/46, మొబైల్ నెంబర్లు: 8008004289, 8008617077.

చిట్టి గ్రూపు	నెలలు	నెలసరి చిట్టి	చిట్టి విలువ
LT V MY	50	1,00,000	50,00,000
LT D MY	50	50,000	25,00,000
LT X MY	50	20,000	10,00,000
LT T MY	50	10,000	5,00,000
FT N MY	40	12,500	5,00,000
FT T MY	40	10,000	4,00,000
FT B MY	40	5,000	2,00,000
TT T MY	30	10,000	3,00,000
TT B MY	30	5,000	1,50,000



నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

హరియాణా నిందితులు.. రైళ్లలో చోరీలు

60 తులాల బంగారు నగలు స్వాధీనం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైళ్లలో ప్రయాణికుల్లా నటిస్తూ బంగారు నగలను ఎత్తుకెళ్తున్న నలుగురు హరియాణా నిందితుల ముఠాలోని ఇద్దరిని నిజామాబాద్ జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18 లక్షల విలువైన 60 తులాల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే ఇన్‌చార్జి ఎస్పీ రాజేంద్రప్రసాద్, సికింద్రాబాద్ రూరల్ డీఎస్పీ నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, ఎస్సైలు శ్రీనాథ్, ప్రమోద్‌కుమార్, నాగేశ్వరరెడ్డి.. విలేకర్లకు వివరించారు. హరియాణాలోని హిస్సార్ జిల్లాకు చెందిన రోషన్(32), రణ్‌వీర్ (30) అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరితో కలిసి రైళ్లలో ప్రయాణికుల సంచుల్లోని నగలు, నగదును దొంగలిస్తున్నారు. ఆగస్టు 4న నాగర్‌సోల్ రైల్లో మహిళ బ్యాగులోని నగలను.. మరోసారి నాగావళి రైల్లో.. ఆభరణాలను చోరీ చేశారు. బాసర-నిజామాబాద్ స్టేషన్ల మధ్య ఉన్న జానకంపేట ప్రాంతంలోనే వారు దొంగతనాలకు పాల్పడ్డారు. సోమవారం రైళ్లలో తనిఖీలు చేపడుతుండగా నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఒకటో ప్లాట్‌ఫాంపై హైదరాబాద్‌కు బయలుదేరబోతున్న నిందితులను పట్టుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. మొత్తం ఎనిమిది కేసులు నమోదయ్యాయి. నిందితులు గతంలో హరియాణాలోని బస్సుల్లో దొంగతనాలు చేసేవారు.

దారులు ధ్వంసమే!

(మొదటి పేజీ తరువాయి) ఇదే పరిస్థితి భవిష్యత్తులోనూ కొనసాగనుందని హెచ్చరిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో, ఉద్ధృతంగా వచ్చే నీటి వల్ల తారు రోడ్లు పూర్తిగా దెబ్బతింటాయని స్పష్టం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ముఖ్య ఇంజినీరు జియాఉద్దీన్ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇంకుడు గుంతల్ని తవ్వి పైపుల్ని వాటికి అనుసంధానించాలని.. పలు ఇతర సూచనలు హెచ్‌ఎంఆర్‌కు లేఖ ద్వారా తెలియజేశామని ఆయన 'ఈనాడు'కు తెలిపారు.

● **చేయాల్సింది ఇలా..** నిబంధనల ప్రకారం ఎల్‌అండ్‌టీ సంస్థ వర్షపునీటిని రోడ్డుపైకి వదలకూడదు. స్తంభాల మధ్యలో ఇంకుడు గుంతలు, నీటిని ఒడిసిపట్టే ట్యాంకులను నిర్మించాలి. ఆ నీటిని పిల్లర్ల మధ్యలో పెంచే మొక్కలకు ఉపయోగించుకోవచ్చు. రైల్వే స్టేషన్ల కిందనున్న నీటి ట్యాంకులు అగ్నిప్రమాదాల సమయంలో ఆదుకొంటాయి. ఇవేవీ పట్టించుకోకుండా ఎల్‌అండ్‌టీ అరకొర నీటి సంరక్షణ ట్యాంకులతో సరిపెట్టింది. పైపుల్ని రోడ్డుపైకి దించేసి నిబంధనల్ని ఉల్లంఘించింది.

● **గాలిలో పాదచారుల భద్రత..** ఇప్పటికే సిగ్నల్ ఫ్రీ విధానంతోనే రోడ్డు దాటలేక పాదచారులు అల్లాడుతుంటే.. ఎల్‌అండ్‌టీ పిల్లర్ల పొడవునా నిర్మిస్తున్న గోడతో మరిన్ని కష్టాలు తలెత్తనున్నాయి. ఈ గోడ నిర్మాణం రోడ్డు ప్రమాదాలకు ఊతమిచ్చేలా ఉందని జీహెచ్‌ఎంసీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. నిబంధనల ప్రకారం ప్రతి 350-300మీటర్లకు రోడ్డుదాటే ఏర్పాటు ఉండాలి. కిలోమీటరు దూరంలో ఉన్న మెట్రోరైలు స్టేషన్ వరకు నడిచివెళ్లి, అవతలి వైపుగమ్యాన్ని చేరుకోవాలంటే కష్టంగా ఉంటుంది. ఈ తిప్పలు తప్పించుకొనేందుకు పాదచారులు ఎక్కడంటే అక్కడ రోడ్డు దాటడం, ప్రమాదాలు చోటు చేసుకోవడం జరుగుతుందని జీహెచ్‌ఎంసీ అంటోంది.

● మెట్రోరైలు మార్గం పొడవు.. 66 కి.మీ, ● స్తంభాలు.. 2,531 ● స్టేషన్లు.. 59

ఎల్‌అండ్‌టీకి బల్దియా సూచన.. ● నిర్మించాల్సిన ఇంకుడు గుంతలు 2,531 ● నీటినిల్వ ట్యాంకులు.. 100(కనీసం)

అయిదేళ్లుగా దాగాడు.. పేరుమార్చినా దొరికాడు

(మొదటి పేజీ తరువాయి) బృందాన్ని పంపుతున్నామని వివరించారు.

హైదరాబాద్.. ముంబయి.. కోల్‌కతా.. నకిలీ పత్రాలు, ఆస్తులతో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న గోవింద్ సల్గోంకర్ సహా మరో నలుగురు నిందితులు తొమ్మిదేళ్ల క్రితం ముంబయిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తప్పుడు పత్రాలు సమర్పించి రూ.80 కోట్లు స్వాహా చేశారు.. బ్యాంకు అధికారులు సీబీఐకి ఫిర్యాదు చేయగా.. 2009లో గోవింద్ సల్గోంకర్‌ను అరెస్ట్‌చేశారు. బెయిల్‌పై విడుదలైన గోవింద్... ఏజ్‌టెక్ పేరుతో కంపెనీ స్థాపించి స్టీమ్‌కోల్(ఆవిరి బొగ్గు) అవసరమైన వారికి... హైదరాబాద్‌కు చెందిన క్యోరీ ఒరెమిన్ సంస్థ ద్వారా కమీషన్ తీసుకుని ఇప్పిస్తున్నాడు. ఈ క్రమంలో క్యోరీ ఒరిమిన్ ప్రతినిధులు అత్యవసర పరిస్థితుల్లో బ్యాంక్ గ్యారెంటీ అవసరమై గోవింద్‌ను సంప్రదించారు. దిల్లీలో గణేష్ ఇంటర్నేషనల్స్ పేరుతో ఎగుమతులు, దిగుమతుల వ్యాపారం చేస్తున్న దీపక్ కుడేషియాకు గోవింద్ విషయాన్ని వివరించాడు. దీపక్ కోల్‌కతాలోని మరో కంపెనీ ద్వారా రూ.6.6 కోట్లకు బ్యాంక్ గ్యారెంటీ పత్రాలను ఇప్పించాడు. పత్రాలను ఇచ్చేముందే ఒరెమిన్ సంస్థ నుంచి రూ.1.01 కోట్లను జమ చేయించుకున్నారు. పత్రాలు తీసుకున్న అనంతరం వాటిని బ్యాంకులో ఇచ్చేందుకు ఒరిమిన్ ప్రతినిధులు కోల్‌కతాలోని ఇండియన్ బ్యాంక్ ఘూస్‌లైన్ శాఖను సంప్రదించారు. అధికారులు ఈ పత్రాలు నకిలీవని చెప్పడంతో హైదరాబాద్‌కు వచ్చి పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదు చేయించారు. 2012లో సీసీఎస్‌కు కేసు బదిలీ అయ్యింది. సీసీఎస్ అధికారులు సల్గోంకర్‌ను అరెస్టుచేసేందుకు ముంబయికి వెళ్లగా ఇల్లూ.. కార్యాలయం తాళం వేసి ఉన్నాయి. కొంతకాలం తర్వాత వెళ్లినా ఇదే పరిస్థితి.. దీంతో కేసును అటకెక్కించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో భాగంగా ఈ కేసు మళ్లీ బయటకు వచ్చింది.

సీబీఐ సమాచారంతో.. క్యోరీ ఒరిమన్ సంస్థను మోసం చేశాక దీపక్ కుడేషియా, గోవింద్‌లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వీరిని పట్టుకునేందుకు ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ముంబయికి వెళ్లారు. అక్కడ సమాచారం సేకరిస్తున్నప్పుడు సీబీఐ కేసు సమాచారం తెలిసింది. తొమ్మిదేళ్ల క్రితం కేసును ఎవరు దర్యాప్తు చేశారు? అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్ పేరును తెలుసుకున్నారు. ఆయన బదిలీపై వెళ్లడంతో చిరునామా, ఫోన్‌నంబరును సేకరించారు. కేసు విచారణ దశలో ఉందని, వాయిదాలకు హాజరవుతున్నాడని కిరణ్‌కుమార్‌కు సీబీఐ అధికారి వివరించారు. ఏప్రిల్‌లో వాయిదాకు వస్తాడని చెప్పగా.. ఆ నెలలో ముంబయి కోర్టుకువెళ్లారు. అక్కడ గోవింద్ సల్గోంకర్‌ను గుర్తించి నీడలా వెంబడించారు. వాషీ రైల్వేస్టేషన్ సమీపంలోని అతడి నివాసప్రాంతానికి వెళ్లారు. అక్కడ వాకబు చేయగా.. పేరు అనిల్‌సావంత్ అని.. ఆరేళ్లుగా ఇక్కడే ఉంటున్నాడని వెల్లడైంది. మూడునెలల వ్యవధిలో అతడి బ్యాంకు ఖాతాలు, ఆధార్‌వివరాలను రహస్యంగా సేకరించారు. గోవింద్ సాల్గోంకర్ పేరుతో కాకుండా అనిల్ సావంత్ పేరుతో తప్పుడు పత్రాలు సమర్పించి ఆధార్‌కార్డు పొందాడని, ఆధార్‌తో బ్యాంకు ఖాతా తెరిచి, ఇదే పేరుతో ప్రస్తుతం ప్రైవేటుకంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు తేలింది. అందరివద్దా వాంగ్మూలాలు తీసుకున్నాక గోవింద్ అలియాస్ అనిల్ సావంత్‌ను ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ బృందం ఆదివారం అదుపులోకి తీసుకుంది. హైదరాబాద్‌కు తరలించి సోమవారం రిమాండ్‌కు తరలించింది.

వెంకన్న.. దర్శనం సులువన్న

ఐఆర్‌సీటీసీ సరికొత్త సేవలు











ఈనాడు, హైదరాబాద్

తిరుమలలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం ఒక్కోసారి ఎంతో కష్టం. కిలోమీటర్ల మేర బారులుదీరి నిలబడి స్వామి సన్నిధికి వెళ్లాలంటే చాలా ప్రయాసతో కూడిన పని. అలాంటి ఇబ్బందులేవీ లేకుండా.. ఇలా వెళ్లి అలా వచ్చేయడానికి ఐఆర్‌సీటీసీ(ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సరికొత్త సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. తిరుమల దర్శనానికి హైదరాబాద్ నుంచి నేరుగా విమానంలో తీసుకెళ్తున్న ఐఆర్‌సీటీసీ.. తిరుపతి నుంచి కూడా ప్రత్యేకంగా యాత్రలను ఏర్పాటు చేసింది. తిరుపతిలో కాలు మోపగానే మీకు ఏసీ వాహనం అందుబాటులో ఉంటుంది. మీరు తయారయ్యాక నేరుగా శ్రీవారి దర్శనానికి రోడ్డు మార్గంలో తీసుకెళ్తారు. ఆ తర్వాత తిరుచానూరు యాత్ర ఉంటుంది. అక్కడ పద్మావతి అమ్మవారి దర్శనం అయిన వెంటనే తిరిగి మిమ్మల్ని తిరుగు ప్రయాణ కేంద్రం వద్దకు తీసుకెళ్లి వదిలిపెడతారు. తమకు ప్రతి రోజు ఉన్న దర్శన కోటాలో వీరిని తీసుకెళ్లి శ్రీవారి దర్శనం ముగించేలా చూస్తామని ఐఆర్‌సీటీసీ జాయింట్ జీఎం ఎన్. సంజీవయ్య తెలిపారు.

శ్రీబాలాజీ దర్శనం ప్యాకేజీ

తిరుపతి, తిరుమల, తిరుచానూరు దర్శనం. తిరుపతి రైల్వే స్టేషన్ నుంచి తిరుమలకు తీసుకెళ్తారు. శీఘ్ర దర్శనం, తిరుమల నుంచి తిరుపతికి తర్వాత తిరుచానూరులో పద్మావతి అమ్మవారి దర్శనం, తిరిగి రైల్వే స్టేషన్‌కు చేర్చుతారు. ఇందుకు 7 నుంచి 12 మంది ఉంటే ఒక్కో టిక్కెట్ ధర రూ. 885, నలుగురి నుంచి ఆరుగురు ప్రయాణించాలంటే ఒక్కో టిక్కెట్ ధర 980, ముగ్గురికి ప్రత్యేక వాహనం కావాలనుకుంటే ఒక్కో టిక్కెట్ ధర రూ. 1085 ఉంటుంది. ఇద్దరికైతే రూ. 1425 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అదే ఒక్కరే వెళ్లాలనుకుంటే రూ. 2450 చెల్లించాలి.

శ్రీ వేంకటేశ్వరం ప్యాకేజీ (కంఫర్ట్):

తిరుపతి, తిరుమల, తిరుచానూరు సౌకర్యవంతమైన(కంఫర్ట్) ఏసీ ప్రయాణం, బాలాజీ దర్శనం, వసతి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనంతో కలిసి ఒక గైడ్ కూడా ఉంటాడు. ఇందుకు ఒక్కరే గదిలో బస చేయాలనుకుంటే రూ. 3386, ఇద్దరు కలిసి ఉండాలంటే చెరి రూ. 2707, ముగ్గురు కలిసి ఉండాలంటే. . ఒక్కొక్కరికీ రూ. 2604, ఐదేళ్ల నుంచి 11 ఏళ్ల లోపు పిల్లలకు బెడ్ సౌకర్యం కూడా ఉండాలనుకుంటే రూ. 2397, బెడ్ అవసరం లేకుంటే రూ. 2026లు చెల్లిస్తే సరిపోతుంది.

శ్రీ వేంకటేశ్వరం ప్యాకేజీ (స్టాండర్డ్):

ఇందులో కూడా తిరుపతి, తిరుమల, తిరుచానూరు సందర్శన ఉంటుంది. ఏసీ ప్రయాణం ఉంటుంది.. కాని నాన్ ఏసీ వసతి కల్పించారు. అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం ఉంటుంది. గైడ్ కూడా ఉంటారు. ఒక్కరే బస చేయాలనుకుంటే రూ. 2562, ఇద్దరు కలిసి బస చేసేందుకు అంగీకరిస్తే చెరి రూ. 2191, ముగ్గురు కలిసి బస చేయదలచుకుంటే రూ. 2150 ఒక్కో టిక్కెట్ ధరను నిర్ణయించారు. 5 నుంచి 11 ఏళ్ల లోపు పిల్లాడికి వసతిలో ప్రత్యేకంగా బెడ్ కావాలనుకుంటే రూ. 2150, బెడ్ అక్కర్లేదనుకుంటే రూ. 1820 చెల్లిస్తే సరిపోతుంది.



వివరాలకు హైదరాబాద్: 040 27702407, 97013 60647, తిరుపతి: 0877 2222010, 97013 76620

ఖైరతాబాద్ గణపతి తొలిపూజకు గవర్నర్



గవర్నర్‌కు ఆహ్వానపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే చింతల, ఉత్సవ నిర్వాహకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ మహాగణపతి తొలి పూజకు రాష్ట్ర గవర్నర్ నరసింహన్ హాజరుకానున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఈనెల 25న ఉదయం 10 గంటలకు తొలి పూజను తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ దంపతులు చేయనున్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నేతృత్వంలో గణేష్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ సుదర్శన్, స్థానిక రాజకీయ పార్టీల ఐకాస నాయకులు మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. తొలి పూజకు హాజరయ్యేందుకు గవర్నర్ అంగీకరించారని ఆ తర్వాత ఉత్సవ కమిటీ తెలిపింది. గవర్నర్‌ను కలిసిన వారిలో వివిధ పార్టీల నాయకులు ప్రేమ్‌రాజ్, మహేష్‌యాదవ్, మహేందర్‌బాబు, ఆవుల అనీల్‌కుమార్, వంశీకృష్ణ, నగేష్, రంజిత్ ఉన్నారు. మరో వైపు ఖైతరాబాద్ మహా గణపతి దాదాపు సిద్ధమయ్యాడు. తుది మెరుగులూ దిద్దుకోవడంతో అప్పుడే భక్తుల సందర్శన మొదలైంది. విగ్రహానికి పూర్తిగా రూపం ఇచ్చేలా కళ్లకు మాత్రం రంగులద్దాల్సి ఉంది. బుధవారం సాయంత్రం 4 గంటలకు పూర్తి చేయనున్నట్లు విగ్రహ శిల్పి రాజేంద్రన్ తెలిపారు.

చిత్ర పరిశ్రమతో సర్కారుకు భారీ ఆదాయం



ప్రసంగిస్తున్న నరేష్ పెనుమాక

ఫిలింనగర్, న్యూస్‌టుడే: తెలుగు చిత్ర పరిశ్రమ జీఎస్టీ పరిధిలోకి రావడం వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరనుందని ఐఆర్ఎస్, ప్రిన్సిపల్ కమిషనర్ నరేష్ పెనుమాక కోరారు. ఫిలింనగర్ ఎఫ్ఎన్‌సీసీలో మంగళవారం జీఎస్టీపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సినీ పరిశ్రమలో దీనిపై ఇంకా అనుమానాలున్నాయని వాటిని నివృత్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏమైనా సందేహాలుంటే అధికారులు తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జీఎస్టీ పరిధిలోకి వచ్చే సినీ పరిశ్రమలోని వారంతా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. 18 శాతం పన్ను కట్టడం కష్టమని తమ దృష్టికి తెచ్చిన విషయాన్ని కేంద్రంలోని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రముఖ సినీ నిర్మాత డి.సురేష్‌బాబు మాట్లాడుతూ తెలుగు సినీ పరిశ్రమ జీఎస్టీ సేవా కేంద్రాలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్, ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ రామరావు, సినీ నిర్మాత కొడాలి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, ఎఫ్ఎన్‌సీసీ కమిటీ సభ్యుడు ఎన్.భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై మహిళా మోర్చా హర్షం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చ నగర అధ్యక్షురాలు బండారి రాధిక ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు వెల్లడించారు. ఈ తీర్పు ద్వారా ముస్లిం మహిళలకు న్యాయం జరుగుతుందని, బాధిత మహిళలు చేస్తున్న న్యాయ పోరాటానికి మతం రంగు పులమవద్దని కోరారు. మతఛాందసవాదులు ఇప్పటికైనా తమ ఆలోచన దృక్పథాన్ని మార్చుకోవాలని హితవు పలికారు. తద్వారా మహిళల హక్కులను కాపాడాలని కోరారు. సుప్రీం తీర్పు ముస్లిం మహిళలకు భరోసా కల్పించిందని, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించిందని చెప్పారు. ఈ తీర్పు పట్ల ముస్లిం మహిళలు కూడా సంతోషంగా ఉన్నారని తెలిపారు.

17న ఓయూ దూరవిద్యా కేంద్రం ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

ఓయూ, న్యూస్‌టుడే: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యా కేంద్రం(పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశపరీక్షను సెప్టెంబరు 17న నిర్వహించనున్నారు. ఈ మేరకు కేంద్ర సంచాలకుడు ప్రొ.గణేశ్ మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. ఐసెట్-2017లో అర్హత సాధించని విద్యార్థులు ఓయూ దూరవిద్యా కేంద్రం నిర్వహించే ప్రవేశపరీక్షలో అర్హత సాధిస్తేనే అడ్మిషన్ లభిస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్ష కోసం వచ్చే నెల 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఓయూలోని పీజీఆర్ఆర్‌సీడీఈ కేంద్రంలో ఉదయం 10.00గంటల నుంచి 11.30 గంటల మధ్య పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు www.oucde.net వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు.

'ఆటోల రిజిస్ట్రేషన్‌పై ఆంక్షలు ఎత్తేయాలి'

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: కొత్త ఆటోల రిజిస్ట్రేషన్‌పై విధించిన ఆంక్షలను ఎత్తి వేయాలని, పేద ఆటోడ్రైవర్లకరుణాలు ఇప్పించాలని, ప్రైవేటు ఆటో ఫైనాన్షియర్ల నుంచి విముక్తి కల్పించాలని తెలంగాణ ఆటోడ్రైవర్ల ఐకాస డిమాండ్ చేసింది. మంగళవారం హైదర్‌గూడ న్యూస్‌సెంటర్‌లో జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ మాట్లాడుతూ నగరంలో ఆటో బ్లాక్ మార్కెటింగ్ విపరీతంగా కొనసాగుతోందన్నారు. రిజిస్ట్రేషన్‌పై ఆంక్షలను ఎత్తివేస్తే బ్లాక్ మార్కెటింగ్‌కు శాశ్వతంగా తెరపడుతుందన్నారు. క్యాబ్‌లపై, కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌పై ఎలాంటి ఆంక్షలు లేవని.. కేవలం కొత్త ఆటోరిక్షాలపైనే ఎందుకని ప్రశ్నించారు. గోడపత్రికలను ఆవిష్కరించారు.



నినాదాలు చేస్తున్న యువతులు

రాజబహద్దూర్ కొత్వాల్‌కు నివాళి

నారాయణగూడ న్యూస్‌టుడే: నిజాం పరిపాలనలో నగరగ శాంతిభద్రతల సంరక్షకుడిగా విశేష సేవలందించిన రాజబహద్దూర్ కొత్వాల వేంకటరామారెడ్డి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆర్‌బీవీఆర్ఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారాయణగూడ వైఎంసీఏ కూడలిలోని రాజాబహద్దూర్ వెంకటరామారెడ్డి విగ్రహానికి ట్రస్టు అధ్యక్షుడు డా.ఎడ్ల రఘుపతి రెడ్డి, కార్యదర్శి కుందవరం వెంకటరెడ్డి కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రస్టు ఆధ్వర్యంలో విద్యా సంస్థల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై వెంకటరామారెడ్డి జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఉపాధ్యక్షులు పాపారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఇంద్రసేనా రెడ్డి, యువత పాల్గొన్నారు.

శంషాబాద్ మార్కెట్‌లో కూరగాయల ధరలు

శంషాబాద్: శంషాబాద్ మార్కెట్‌లో మంగళవారం నాటి కూరగాయల ధరలు కిలో.. టమాట 50, ఆలుగడ్డ 25, బెండకాయ 45, దొండకాయ 25, దోసకాయ 30, సొరకాయ 20, పొట్లకాయ 25, చిక్కుడుగాయ 45, గోకరకాయ 40, బీర్నీసు 35, కీరా 30, క్యాప్సికం 35, క్యాబేజీ 30, క్యారెట్ 30, చేమగడ్డ 35, కందగడ్డ 30, ములక్కాడ 25, వంకాయ తెల్లది 45, కాకరకాయ 40, బీరకాయ 45, పచ్చిమిర్చి 50, ఉల్లిగడ్డలు 35.

దా రు లి లా.. గంగను చేరేదెలా?


వీధిదీపాలు లేని పాతకర్నూలు రోడ్డు

కాటేదాన్, న్యూస్‌టుడే: గణనాథుడి సేవకు సమయం ఆసన్నమవుతోంది. బస్తీలు... వాడలు, కూడళ్లలో మండపాలు ముస్తాబవుతున్నాయి. చవితివేళ బొజ్జ గణపతిని సేవించి సంబరాలు చేసుకోవాలని భక్తులు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే వీటన్నింటిని మించి గణనాథుడి నిమజ్జనోత్సవాలను ఎలా నిర్వహించాలో ఇప్పటి నుంచే ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు. అయితే గణేష్ ఉత్సవాల సంగతి అటుంచితే.. నిమజ్జనం రోజు విగ్రహాల తరలింపు సమస్యగా మారనుంది. ప్రధానంగా నగరంలోని రెండో అతి పెద్ద డివిజనైన మైలార్‌దేవుపల్లిలో కొలువయ్యే గణనాథులకు నిమజ్జనానికి వెళ్లేందుకు మార్గాలు కరవయ్యాయి. మండపాలు రోడ్డుపైనే ఉన్నా.. ఆ దారి కచ్చారోడ్డే. మరోవైపు వర్షాలతో డివిజన్‌లోని అని బస్తీల్లో మురుగు నిరంతరం పారుతూ రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. అక్కడక్కడ అసంపూర్తిగా వదిలేసిన మరమ్మతు పనులతో అంతర్గత రోడ్లు సైతం గతుకులమయంగా మారాయి. ఈ తరుణంలో విగ్రహాలను నిమజ్జనానికి ఎలా తరలించాలన్నది ఉత్సవ కమిటీ సభ్యులకు ప్రశ్నార్థకంగా మారుతుంది. నిమజ్జనం రోజు లేదా ముందురోజు భారీ వర్షం పడిందో ఇక అంతే సంగతులు.

మైలార్‌దేవుపల్లి డివిజన్ లోనే...

మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని పల్లెచెరువులో ఏటా 3,500లకుపైగా వినాయక విగ్రహాలు నిమజ్జనం అవుతుంటాయి. ఒక్క ఈ డివిజన్‌లోనే 1500 వందలకు పైగా విగ్రహాలు ఏర్పాటవుతుంటాయి. ఇవన్నీ కూడా పల్లెచెరువుకే తరలివస్తాయి. వీటితోపాటు పాతబస్తీ చాంద్రాయణగుట్టకు చెందిన వందలాది విగ్రహాలు సైతం ఇక్కడికే వస్తాయి. ప్రతి ఏట మండపాల సంఖ్య పెరుగుతుండడంతో ఆయా ప్రాంతాల నుంచి పల్లెచెరువుకు నిమజ్జనం కోసం వచ్చే విగ్రహాల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుంది. అయితే ఆయా బస్తీలు, కాలనీలైన లక్ష్మీగూడ, బాబుల్‌రెడ్డినగర్, మైలార్‌దేవుపల్లి, లక్ష్మీగూడ, వాంబేకాలనీ, రాజీవ్‌గృహకల్ప సముదాయాలు, లక్ష్మీగూడ హౌసింగ్‌బోర్డు కాలనీ, టీఎన్‌జీఓస్ కాలనీ, శాంతినగర్, దుర్గానగర్, ప్రగతికాలనీ, మార్కండేయనగర్, ప్రేమావతీపేట, బృందావన్ కాలనీ, గగన్‌పహాడ్ తదితర బస్తీల నుంచి అంతర్గత దారుల్లో నిమజ్జన ఊరేగింపులతో వచ్చే గణనాథులకు అవస్థలు తప్పవు. ప్రధానంగా చాంద్రాయణగుట్ట, ఇంజన్‌బౌలి, జంగమ్మెట్, ఫలక్‌నుమా, ఉప్పుగూడ, తదితర ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలకు కచ్చా రహదారులు స్వాగతం పలుకుతాయి. కొన్నిరోజుల క్రితం వరకు ఆయా అంతర్గత రోడ్లన్నీ బాగానే ఉన్నాయి.. ఇటీవల కాలంలో భూగర్భంలో విద్యుత్తు కేబుళ్లు, భూగర్భ డ్రైనేజీ తవ్వకాలు జరుపడం.. పనుల పూర్తయినా ఆ దారులను బాగు చేయకపోవడంతో అధ్వానంగా మారాయి.

బస్తీల్లో అస్తవ్యస్తంగా అంతర్గత దారులు

వీధిదీపాలు లేవు.. పల్లెచెరువంతా గుర్రపు డెక్కే..

నిమజ్జనోత్సవాలకు తప్పని అవస్థలు

అంతా గుర్రపు డెక్కే...

మరో రెండురోజుల్లో వినాయక ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం మూడోరోజు నుంచి పల్లెచెరువులో నిమజ్జనాలు మొదలవుతాయి. కానీ చెరువు వద్ద ఎలాంటి ఏర్పాట్లు చేపడుతున్న దాఖలాలు లేవు. ప్రస్తుతం పల్లెచెరువు నిండా గుర్రపుడెక్క ఆవహించి ఉంది. నిమజ్జనం కాదు కదా.. కనీసం ఒడ్డున నీళ్లలో కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. చెరువులో చుక్క నీరు కనిపించకుండా గుర్రపు డెక్క పరుచుకుంది. సాహసించి ఎవరైనా అందులోకి దిగితే.. ప్రాణాలు పోయే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా సర్కిల్ అధికారులు గుర్తించి గుర్రపుడెక్క తొలగింపు కార్యక్రమం ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. పల్లెచెరువు వద్ద మూడో రోజు నుంచే నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని పేర్కొంటున్నారు.


పల్లెచెరువులో గుర్రపుడెక్క


మైలార్‌దేవుపల్లిలో ఓ అంతర్గత దారి దుస్థితి

అన్ని చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

ఈసారి నిమజ్జనోత్సవాలకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసేలా అధికారులకు ఆదేశాలు, సూచనలు అందజేశామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. అంతర్గత మార్గాలు బాగు చేసి, ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ డీసీకి చెప్పినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా.. ప్రశాంతంగా విగ్రహాలను నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఆదర్శకాలనీలో సమస్యలు పరిష్కరించాలి


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కాటేదాన్, న్యూస్‌టుడే: ఆప్కోకాలనీలోని సమస్యలు తీర్చాలని రాజేంద్రనగర్ సర్కిల్ నవయువ యూత్ అధ్యక్షులు కుమారస్వామి కోరారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డికి ఈ విషయంపై మంగళవారం వినతి పత్రం అందజేశారు. కాలనీనుంచి పద్మశాలిపురం ఇటు పాతకర్నూలు రోడ్డు ధరమ్‌కాంట వరకు ఉన్న రోడ్డుపై నిత్యం మురుగు పారుతూనే ఉంటుందని, వీధిదీపాల సమస్య, నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మరో రెండు రోజుల్లో గణేష్ ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. బుధవారం బస్తీలో పర్యటించి సమస్యలను పరిశీలిస్తానని కార్పొరేటర్ వారికి హామీ ఇచ్చారు. చంద్రయ్య, శేఖర్ పాల్గొన్నారు.

మున్నూరు కాపులు ఏకం కావాలి


సమావేశం బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నేతలు

శంషాబాద్: తెలంగాణలోని మున్నూరు కాపులందరు ఏకం కావాలని తెదేపా రాష్ట్ర నాయకులు బుక్కా వేణుగోపాల్ అన్నారు. శంషాబాద్‌లో మంగళవారం మున్నురుకాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుక్కా వేణుగోపాల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్నూరుకాపులు వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని కులాల వారికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, కానీ మున్నూరుకాపు కులాలు ఎలాంటి పథకాలకు నోచుకోవడం లేదని అన్నారు. ఐఖ్యతగా లేకపోవడం వల్లే తమ కులస్థులను గుర్తించడం లేదని, అందరం కలిసి ఏకతాటిపై ఉండి హక్కులు సాధించుకోవాలని అన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కమిటీలు వేయాలన్నారు. మండల జెడ్పీటీసీ సతీష్ మాట్లాడుతూ.. మున్నూరుకాపుల ఐఖ్యత కోసం ఈనెల 27న ఎంఎంఆర్ గార్డెన్‌లో భారీఎత్తున నిర్వహిస్తున్న సమావేశానికి తరలిరావాలన్నారు. పురుషోత్తంరావు, కొండా దేవయ్య, లక్ష్మణ్, రాజశేఖర్, శ్రవణ్, బిక్షపతి పాల్గొన్నారు.

కోకాపేటలో డ్రైనేజి పనులు ప్రారంభం

నార్సింగి: కోకాపేట గ్రామంలో రూ.14 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజి పనులను సర్పంచి మంజుల యాదగిరి మంగళవారం ప్రారంభించారు. గ్రామంలో ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఈ సందర్భంగా సర్పంచి తెలిపారు. ఎంపీటీసీ ఆండాలు, నాయకులు హరిశంకర్, విజయ్‌బాబు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు చిక్కని క్రూర జంతువు

శంషాబాద్ గ్రామీణ: పొలాల వద్ద ఉన్న పశువుల పాకలపై రాత్రిపూట గుర్తు తెలియని జంతువు దాడి చేసి వారం రోజుల వ్యవధిలో నాలుగు గేదెలను పొట్టనపెట్టుకొంది. సదరు జంతువు ఇంకా పట్టుబడకపోవడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. సదరు జంతువును పట్టుకోవడానికి అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. గొల్లూర్ అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న పెద్దషాపూర్, బురుజుగడ్డ తండా పొలాల్లో ఉన్న పశువుల పాకల వద్ద 25 కెమెరాలను, 6 బోనులను ఈనెల 14న ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు ఆ జంతువు జాడ మాత్రం కానరాలేదు. దీంతో కెమెరాలను తొలగించామని శంషాబాద్ రేంజ్ అటవీ శాఖ అధికారి హరీమోహన్‌రెడ్డి తెలిపారు. బోన్లను యధావిధిగా మరికొన్ని రోజులు కొనసాగిస్తామన్నారు.

ప్రజల సహకారంతోనే చెరువుల పరిరక్షణ

☛ హుడా కమిషనర్ చిరంజీవులు

మణికొండ, న్యూస్‌టుడే: చెరువుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకొచ్చినప్పుడే చక్కని ఫలితాలు సాధించే వీలుందని హుడా కమిషనర్ చిరంజీవులు అన్నారు. మంగళవారం గండిపేట్ మండల పరిధిలోని నెక్నాంపూర్ చిన్న చెరువు వద్ద ధ్రువాంశ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మట్టి గణపతి ప్రతిమలను విద్యార్థులకు, కాలనీలవాసులకు ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. హుడా పరిధిలో ఈ యేడాది 30 వేల మట్టి గణపతి విగ్రహాలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. తమ పరిధిలోని 32 చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టామని, అందులోని నెక్నాంపూర్ చిన్నచెరువు, ఇబ్రహీం చెరువుల పరిరక్షణకు కాలనీవాసులు, స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. చిన్నచెరువులో నిమజ్జనం చేయకుండా ప్రత్యేకంగా నీటి కొలను నిర్మిస్తున్నామని గుర్తుచేశారు. నిమజ్జనానికి వీలుగా క్రేన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇబ్రహీం చెరువులో గురపుడెక్క తొలగింపునకు ప్రత్యేకంగా యంత్రాలను సమకూర్చామని తెలిపారు. సమస్యకు పరిష్కారం మనందరికి తెలిసినా.. ఆచరించకపోవడంతోనే జటిలమవుతోందన్నారు. మూసీ నది వెళ్లే ప్రాంతాల్లో కాలుష్య జలాల కారణంగా మహిళలకు గర్భస్రావం అవుతోందని పత్రికల్లో కథనాలు వచ్చాయని, ఈ పరిస్థితి చక్కదిద్దేందుకు చెరువుల్లో రసాయనాలు, మురుగు కలవకుండా చర్యలు చేపట్టాల్సిన బాధ్యతలను గుర్తుచేస్తున్నాయని వెల్లడించారు. చెరువుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలని గ్రామసర్పంచికి సూచించారు. అనంతరం చెరువుల పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. చెరువు వద్ద నిర్మాణంలో ఉన్న నిమజ్జన కొలనును ఆయన పరిశీలించి పనుల్లో వేగం పెంచాలని గుత్తేదారుకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్, సర్పంచులు ఉశేష్‌కుమార్, నర్సింహ, ఎంపీటీసీ సభ్యులు తామోదన్‌రావు, రామకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీరాములు, మాలకొండయ్య, ధ్రువాంశ్ ప్రతినిధులు మధులిక, నీరజ్, పవన్, కాలనీ సంఘాల ప్రతినిధులు సీతారామ్‌దాస్, కాంతారావు, లక్ష్మినారాయణ ఉన్నారు.



మాట్లాడుతున్న చిరంజీవులు, చిత్రంలో ఎంపీపీ, సర్పంచి

రాజేంద్రనగర్

చిన్నారుల మధ్య మెగాస్టార్ పుట్టినరోజు

శంషాబాద్, న్యూస్‌టుడే: మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు చిన్నారుల మధ్య ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ మండల కేంద్రంలో మంగళవారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను చిరంజీవి మెగా అభిమాన సంఘం అధ్యక్షులు జిలేబి శ్రీను ఆధ్వర్యంలో చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో రవి, యాదగిరి, వెంకట్, విష్ణు, సిద్ధులు, చిన్న పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి



ఎంపీడీవోకు సెలవు పత్రాలను ఇస్తున్న కార్యదర్శులు

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకంను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. 2004 నుంచి ఉద్యోగంలో చేరిన పంచాయతీ కార్యదర్శులందరు వచ్చే నెల 1న సామూహిక సెలవు పెడుతున్నామంటూ మంగళవారం ఎంపీడీఓ శ్రీకాంత్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు సీఎచ్. శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ. . కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానంలో ఉద్యోగ భద్రత లేదన్నారు. జీవితాంతం ప్రజా సేవ చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత పింఛన్ వస్తుందన్న నమ్మకం లేదన్నారు. వెంటనే పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉద్ధృతం చేస్తామని కార్యదర్శులు కె. శివప్రసాద్, పాండురంగం, శ్యాంసుందర్, సునీత, సుజాత, స్వప్న, సురేష్ హెచ్చరించారు.

స్థలాల పరిరక్షణకు చర్యలు

- హుడా కమిషనర్ చిరంజీవులు
- పార్కు స్థలాల అభివృద్ధికి తిరుమలహిల్స్‌వాసుల చొరవ

మణికొండ, న్యూస్‌టుడే: తిరుమలహిల్స్ కాలనీ పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని హుడా కమిషనర్ చిరంజీవులు స్పష్టం చేశారు. నెక్నాంపూర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన ఆయనను పుప్పాలగూడ తిరుమలహిల్స్ కాలనీవాసులు కలిసి పార్కు స్థలాల విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చారు. పార్కు స్థలాలపై న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఆయనకు వివరించారు. మరిన్ని పార్కు స్థలాల్లో హుడా అధికారులు ఇచ్చిన అనుమతులపై కాలనీ కోశాధికారి కాంతారావు ఆయన దృష్టికి తేగా పార్కు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. వాటిని పరిశీలించి, సిబ్బంది ఇచ్చిన అనుమతులు రద్దు చేస్తామని తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. గండిపేట్ మండల పరిధిలోని పుప్పాలగూడ గ్రామ సర్వేనంబరు 87, 119లో ఏర్పాటు చేసిన తిరుమలహిల్స్ లేఅవుట్ సమయంలో కాలనీ పార్కు స్థలాలుగా వదిలారు. కొందరు ఈ స్థలాలు తమవిగా తప్పుడు రికార్డులను సృష్టించి పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే కాలనీవాసులు, గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి పార్కు స్థలాలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానం ఈ నెల 8వ తేదీన ఆ స్థలాలు కాలనీ పార్కు స్థలాలుగా గుర్తించి తీర్పు ఇచ్చింది. హుడా లేఅవుట్ అనుసరించి కాలనీవాసులు పార్కు కోసం వదిలిన స్థలాల అభివృద్ధి పనులను ఇటీవల చేపట్టారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సైతం పట్టించుకోకుండా ఆ స్థలాలు తమవి అంటూ కొందరు నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. వారికి అనుకూలంగా పోలీసులు ఆదివారం పార్కు స్థలాల వద్దకు వచ్చి కాలనీవాసులను పనులు చేపట్టవద్దని సూచించారు. సోమవారం ఎంపీటీసీ సభ్యుడు శివప్రసాద్, కాలనీ ఉపాధ్యక్షుడు భరత్, రాధాకృష్ణ, కాలనీవాసులు, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటశివయ్యలు నార్సింగి సీఐ రమణాగౌడ్‌ను కలిసి న్యాయస్థానం తీర్పు పత్రాలు, పార్కు స్థలాలుగా నిర్ధారించే పత్రాలను అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన ఆ స్థలాల్లో పనులు చేపట్టవచ్చని తెలిపారు. ఈ మేరకు కాలనీవాసులు పార్కు స్థలంలో వినాయక మండపం ఏర్పాటు చేసి.. కూర్చునేందుకు వీలుగా బెంచీలు సమకూర్చారు.



తిరుమలహిల్స్‌లోని పార్కు స్థలం చదును చేసి బెంచీలు ఏర్పాటు చేసిన కాలనీవాసులు



తిరుమలహిల్స్ వాసులకు మట్టి గణేష్ ప్రతిమ అందజేస్తున్న హుడా కమిషనర్ చిరంజీవులు

కాలనీవాసుల సహకారం:

డా.అవినాష్, అధ్యక్షుడు, తిరుమలహిల్స్

కాలనీ లేఅవుట్‌లో వదిలిన 8663 చదరపు గజాల స్థలాల అభివృద్ధికి కాలనీ సంక్షేమ సంఘం చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం 1661 గజాల పార్కు స్థలంలో గణేష్ నవరాత్రుల కోసం మండపం నిర్మించి.. కాలనీవాసులు కూర్చునేందుకు వీలుగా బల్లలు ఏర్పాటు చేశాం. న్యాయస్థానం తీర్పును అనుసరించి కాలనీలోని పార్కు స్థలాల అభివృద్ధిని స్థానికుల సహకారంతో పూర్తిచేస్తాం.

కల్తీ అల్లంవెల్లులి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కల్తీ అల్లం పేస్ట్

ఈ ఇంకుడు గుంతల ద్వారా భారీ ఎత్తున ఈ ప్రాంతంలో భూగర్భ జలాలను సంరక్షించే వీలు ఏర్పడుతుంది. నగరంలో సరాసరి వర్షపాతం 830 ఎంఎం. ఉదాహరణకు భవనం పైకప్పు 50 చదరపు మీటర్ల పరిమాణంలో ఉంటే కురిసే వర్షపు నీరు 25 వేల లీటర్లు. ప్రస్తుతం సీఎం క్యాంపు కార్యాలయం భవనాల పైకప్పు విస్తీర్ణం 4,500 చదరపు మీటర్లు. సరాసరి 500 మిల్లీమీటర్ల వర్షపాతం లెక్కన తీసుకున్నా... దాదాపు 10 లక్షల లీటర్ల నీళ్లు భూమిలోకి ఇంకించవచ్చు. అదే వేయి మిల్లీమీటర్ల వర్షం కురిస్తే 20 లక్షల లీటర్లు భూమిలోకి పంపే వీలుంది. ఇతర వనరులపై ఆధారపడకుండానే ఈ నీటిని భవన అవసరాలకు వాడుకునే వీలుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న 20 ఇంకుడు గుంతల్లో 14 సాధారణ పద్ధతిలోనే నిర్మించనున్నారు. మిగతా 6 గుంతలకు ఇంజక్షన్ బోర్లు వేయనున్నారు. తొలుత 50-60 అడుగుల మేర బోరు వేసి దానిలో గొట్టం చుట్టూ 40, 20 మి.మీ. మేర గులకరాళ్లు, ఇసుక వేసి మూసివేస్తారు. అనంతరం ఈ గుంతకు భవనం పైకప్పు నుంచి గొట్టంతో అనుసంధానం చేస్తారు. భవనంపై పడిన ప్రతి నీటి చుక్కా ఇలా గొట్టం ద్వారా ఈ గుంతలోకి చేరి ఫిల్టర్ అయి భూమిలోకి ఇంకుతుంది.

ఇదే స్ఫూర్తి కొనసాగిస్తే

గ్రేటర్ వ్యాప్తంగా వేల సంఖ్యలోనే భారీ భవంతులు, గేటెడ్ కమ్యూనిటీలు ఉన్నాయి. చాలా వాటికి అసలు ఇంకుడు గుంతలే లేవు. భూగర్భ జలాలను తోడివేయటం తప్ప తిరిగి లోనికి పంపించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. దీంతో ప్రతి వేసవిలో నగర వ్యాప్తంగా లక్షలాది బోర్లు ఎండిపోతున్నాయి. రూ.కోట్ల ఖర్చుపెట్టి నీటిని కొనుగోలు చేసుకునే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో వర్షపు నీటి ఆదాతో ఎంతో మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. సుపరిపాలన వేదిక అంచనా ప్రకారం హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రాంతంలో ఏటా కురిసే వర్షం నీటిని లెక్క కడితే 15 టీఎంసీలుగా చెప్పుకోవచ్చు. ఇందులో సగమైనా ప్రస్తుతం ఆదా కావడం లేదు. ఏటా తాగునీటి కోసం వందల కిలోమీటర్ల దూరం వెళ్లి రూ.వందల కోట్లు వెచ్చించి తీసుకొస్తున్నారు. మరోవైపు నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో భూమిలోకి అసలు నీళ్లు ఇంకడం లేదు. ఎవరికి వారు చొరవతో ముందుకొచ్చి ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం వల్ల భారీ ఎత్తున వర్షపు నీటిని ఆదా చేసుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు.

న్యాయం దృష్టిలో అందరూ సమానమే: జడ్జి



న్యాయ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న షేక్ మదార్

బార్కాస్, న్యూస్‌టుడే: న్యాయం దృష్టిలో అందరూ సమానమే.. న్యాయానికి గొప్ప బీద అనే తేడాలేదని అందరికి సమాన అవకాశాలు కల్పించడానికి న్యాయ వ్యవస్థ పనిచేస్తుందని రంగారెడ్డి న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ మదార్ అన్నారు. మంగళవారం బార్కాస్ డివిజన్ బండ్లగూడ పల్లెచెరువు వద్దనున్న ఆరోరా లా- కాలేజ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆరోరా లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుప్రీంకోర్టు-హైకోర్టు స్థాయిలో న్యాయ సేవా కమిటీలు ఏర్పడ్డాయి. ఇవి తమ తమ కోర్టుల ప్రాధికార పరిధిలో లోక్ అదాలత్‌లనూ న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించడమే కాకుండా అర్హులైన వారికి ఉచిత న్యాయ సేవలను అందిజేస్తుందన్నారు. ఉచిత న్యాయసేవలకు అర్హుడైన వ్యక్తి తమ సమీప న్యాయ సేవా అధికారి సంస్థను గానీ, న్యాయ సేవా కమిటీలను గానీ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సత్యనారాయణరెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, పి.ఎస్ శర్మా, శ్యామలదేవి, అరోరా లా-కాలేజ్ ప్రిన్సిపల్ సుజనతోపాటు కాలేజ్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వమే వంద శాతం జీతాలు భరించాలి

- లెక్చరర్ అసోషియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్



నల్లబ్యాడ్జి ధరించి నిరసన తెలుపుతున్న సిటి కాలేజ్ అధ్యాపకులు

జహనుమా, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుల జీతాల వ్యయం కేంద్ర ప్రభుత్వమే వంద శాతం భరించాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్ డిమాండ్ చేసింది. ఈ సంస్థ పిలుపు మేరకు వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, టీజీసీటీఏ ఉద్యోగ సంఘాలకు చెందిన అధ్యాపకులు చొక్కాలకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ సిటీ కాలేజ్ ప్రధాన గేటు ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్, రవిప్రసాద్, డా.రత్నాప్రభాకర్, సౌజన్య, స్వప్రభా పాండా, శ్రీలత, డా.చిన్నాబాబు, సుచిత్రసింగ్, రాజేష్‌కుమార్, డా.వెంకటేశ్వర్‌రావు, జయమ్మతోపాటు ఇతర అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యంత్రాంగం ఊరుకుంది వాహనం కూరుకుంది



వివిధ పనుల కోసం తవ్వకాలు సాగించడం వల్ల నగరంలోని రహదారులు గోతులతో అస్తవ్యస్తంగా మారాయి. సిబ్బంది మరమ్మతులు చేపట్టక అలసత్వంగా వ్యవహరిస్తున్నారు. కూకట్‌పల్లిలో సరకు రవాణా చేసే ఓ వాహనం ఇలా రహదారిపై కూరుకుపోయింది.

వెళ్తున్న కారులో మంటలు



కారులోంచి వస్తున్న పొగలు

నాగోల్: వెళ్తున్న కారులో మంటలు వచ్చి దట్టమైన పొగలు కమ్ముకున్న ఘటన నాగోలు రహదారిలో మంగళవారం చోటు చేసుకుంది. కొత్తపేట సమీపంలోని న్యూమారుతీనగర్‌లో నివసించే వి.నారాయణమూర్తి(55) సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ శాఖలో ఏఈఈగా పనిచేసి పదవీ విరమణ పొందారు. మంగళవారం సాయంత్రం తన ఆల్టో కారులో మోహన్‌నగర్ మీదుగా నాగోలుకు వెళ్తుండగా న్యూనాగోలు లోని అలహాబాద్ బ్యాంకు సమీపంలోకి చేరుకుంటుండగా ఇంజిన్ నుంచి పొగలు వచ్చాయి. కారును రోడ్డు పక్కన నిలిపి స్థానికుల సాయంతో పరిశీలించారు. మంటలురేగి ముందు భాగం కాలిపోయింది. స్థానికులు నీటితో మంటలు ఆర్పేశారు. కారులోని నారాయణమూర్తి సురక్షితంగా బయటపడ్డారు.

ఆధునిక పరిజ్ఞానంతో... నర్సింగ్ బోధన సాగాలి

- డీఎంఈ రమేశ్‌రెడ్డి

పద్మారావునగర్: మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా వైద్యరంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే తరహాలో నర్సింగ్ విద్యాబోధన సాగాలని డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోయిగూడ రైల్ కళారంగ్ ఆడిటోరియంలో ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు అనుబంధంగా ఉన్న తెలంగాణ రాష్ట్ర నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి ద్వైవార్షిక రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రమేష్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలందించే వైద్యులకు సమానమైన గౌరవం నర్సులకుందన్నారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ కృపాసంతోషం మాట్లాడుతూ... తెలంగాణలో 80 నర్సింగ్ కళాశాలలు, 157 జీఎన్‌ఎంలు, 112 ఏఎంఎన్ విద్యాసంస్థలున్నాయనీ, వాటిద్వారా నాణ్యమైన బోధనను అందిస్తూ, సేవాభావంతో కూడిన నర్సులు విధుల్లోకి వస్తుండటం గమనార్హమన్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రభుత్వం కొత్తగా నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేయబోతోందన్నారు. రాష్ట్ర నర్సింగ్ కళాశాల రిజిస్ట్రార్ బి.విద్యావతి, అసోసియేషన్ తెలంగాణ శాఖ అధ్యక్షురాలు సిస్టర్ రోజమ్మ, ఉపాధ్యక్షురాలు విద్యుల్లత, ప్రభుత్వ నర్సింగ్‌కళాశాల ప్రిన్సిపాల్ జయప్రద, కార్యదర్శులు కేటీ శీబా, ఎం.రాజేశ్వరి, కోశాధికారి లిల్లీకమల తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు రంగవల్లి, క్విజ్, వ్యాచరచన, టాలెంట్‌నైట్ తదితర పోటీలను నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను ఆహూతులను అలరించాయి.



విద్యార్థుల నృత్య ప్రదర్శన



కార్యక్రమానికి హాజరైన వారు




కారులోనే ఖానా పీనా..!

● నగరంలో విస్తరించిన నయా పోకడ
● వాహనంలో పడిపోయిన ఆహారంతో బ్యాక్టీరియా ముప్పు
● ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటేనే మేలు

ఈనాడు, హైదరాబాద్

నగరంలో కారు వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. కొన్ని రహదారుల్లో ద్విచక్ర వాహనాల కంటే నాలుగు చక్రాలవే ఎక్కువగా కన్పిస్తున్నాయి. కారులో ప్రయాణం విలాస స్థాయి నుంచి ఇప్పుడు అవసరంగా మారింది. బైకులపై ప్రయాణం ప్రమాదకరమని.. సౌకర్యంగా ఉంటుందని కార్లలో ప్రయాణానికి క్రమంగా మొగ్గు చూపుతున్నారు. కారు అద్దాలు మూసేసి కాలుష్యం బారి నుంచి తప్పించుకుంటున్నామని సంబరపడుతున్నా. . కార్ల లోపల పడిపోయిన ఆహార పదార్థాలతో ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోకపోవడంతో అనారోగ్య ముప్పు పొంచి ఉందంటున్నారు వైద్యులు.

గ్రేటర్‌లో వాహనాలు అర కోటికి చేరాయి. ఇది వరకు కార్ల సంఖ్య 10 శాతం వరకు ఉండేది. ఇప్పుడు ఇది ఏటేటా పెరుగుతోంది. సొంత ఇల్లు ఉన్న వారిలో ఎక్కువ మంది కార్లు కలిగి ఉన్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ లాంటి ప్రాంతాల్లో ఇంట్లో ఒక్కొక్కరికి ఒక్కో కారు ఉంటుంది. వీరే కాదు వృత్తి, ఉద్యోగరీత్యా కార్లు వినియోగించేవారు పెరుగుతున్నారు. నగరంలో ప్రజారవాణా వ్యవస్థ అందరికీ సౌకర్యంగా లేకపోవడంతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలో ఉద్యోగం చేసేవారు బైకులు వదిలి కార్లకు మారిపోతున్నారు. బాహ్య వలయ రహదారి అందుబాటులోకి రావడంతో నగరం నుంచి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతాల్లో కొలువు చేసేవారు సైతం కారులోనే వెళుతున్నారు. ఒకే కాలనీ, ఒకే సంస్థలో, ఒకే ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులైతే కార్ పూలింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు. శుభకార్యాలు, సెలవురోజుల్లో కార్లను బయటికి తీసేవారు పెరుగుతున్నారు.

వెనువెంటనే..

● ఆహార పదార్థాలు పడగానే ఎప్పటికప్పుడు మ్యాట్లు తొలగించి శుభ్రం చేసుకోవడం ముఖ్యం. వారానికి ఒకసారి కారు తీసేవారు వెంటనే శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. లేదంటే వారం తిరిగేసరికి బ్యాక్టీరియా చేరి దుర్వాసన వెదజల్లే ప్రమాదం ఉంది.

● సులువుగా శుభ్రం చేసుకునేలా, దులిపితే వదిలిపోయేలా ఉండే మ్యాట్లను ఉపయోగించడం ద్వారా కొంత శ్రమను తగ్గించుకోవచ్చు. మార్కెట్లో త్రీడీ మ్యాట్లు దొరుకుతున్నాయి. వీటిని సులువుగా శుభ్రం చేసుకోవచ్చు.

● తక్కువ ఖర్చులో కావాలంటే సీట్లకు తువ్వాలు చుట్టడం వల్ల ఉతకడానికి అనువుగా ఉంటుంది. శుభ్రంగా ఉంటుంది.

● శుభ్రంగా ఉతికిన వస్త్రాన్ని ఉపయోగించి వ్యర్థాలను బయటికి పంపించవచ్చు. మైక్రో ఫైబర్ వస్త్రాలు మార్కెట్లో దొరుకుతున్నాయి. వీటిని చేతికి తొడుక్కుని శుభ్రం చేసుకోవచ్చు.



● ఇంట్లో ఉండే వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేసుకోవచ్చు. లేదంటే మార్కెట్లో కారు శుభ్రం చేసే వ్యాక్యూమ్ క్లీనర్లు పొడవాటి హ్యాండిల్‌తో దొరుకుతున్నాయి.



ఆహారశాలగా కూడా..

కారు షికారుకే కాకుండా 70 శాతం మందికి ఆహారశాల కూడా. తినడం, పానీయాలు తాగడం అంతా ఇందులోనే. పిల్లలే కాదు.. పెద్దలది సైతం ఇదే ధోరణి. తీరిక లేని నగర జీవితంలో కారులోనే అల్పాహారం కానిచ్చేస్తున్నారు. ప్రధాన మార్గంలో పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో హోటల్ నుంచి అల్పాహార పొట్లం తీసుకుని కార్లో వెళుతూ ఆరగించడం.. కారు నిలిపి ఉంచి వెళితే రాంగ్ పార్కింగని పోలీసులు ఎక్కడ తమ వాహనాన్ని తీసుకెళతారో అని కార్లోనే కూచుని ఆరగిస్తున్నారు. ఇటీవల డ్రైవ్ ఇన్ పోకడతో ఇది మరింత పెరిగింది. ఈ క్రమంలో తినుబండరాల అవశేషాలు కార్ల సీట్ల సందుల్లో, మ్యాట్ల కింద పడిపోతున్నాయి. వీటిని సకాలంలో శుభ్రం చేయక పోవడంతో జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది.



ప్రమాదకర బ్యాక్టీరియా చేరి..

కారులో ఆహారం తినేటప్పుడు పడిన పదార్థాలు బ్యాక్టీరియా ఏర్పడటానికి కేంద్ర బిందువులుగా మారుతున్నాయి. ఈకోలి వంటి ప్రమాదకర బ్యాక్టీరియా అపరిశుభ్ర కార్లలో బయటపడిందని వేర్వేరు ప్రాంతాల్లో మైక్రో బయాలజిస్టులు చేసిన అధ్యయనంలో వెల్లడింది. స్టీరింగ్, గేర్, డోర్ హ్యాండిల్స్, కారు మ్యాట్లు, సీట్ల కింద వేర్వేరు బ్యాక్టీరియాను వీరు గుర్తించారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోక పోవడం వల్ల చర్మ సంబంధ సమస్యలు, వాంతులు, డయేరియా బారిన పడే ముప్పు ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఈ బ్యాక్టీరియా కారులో తీసుకెళ్లే లంచ్ బాక్స్‌లోని ఆహారాన్ని విషతుల్యంగా మార్చే ప్రమాదముందని చెబుతున్నారు.



ఈనాడు, హైదరాబాద్

పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఆరాటపడటం అభిలషణీయమే. ఆ ఆరాటం పెద్దల్లో ఉన్నప్పుడే బుజ్జాయిలు ఉన్నతంగా రాణిస్తారు. చిన్నారుల్లో సృజనకు పదును పెట్టేలా ఉన్నప్పుడే అర్థం పరమార్థం. అలా కాదని తమ ఇష్టాలను పిల్లలపై బలవంతంగా రుద్దే ప్రయత్నాలు చేస్తేనే ఇబ్బందులు మొదలవుతాయి. ఆ క్రమంలో వారు ఇళ్ల నుంచి పారిపోవడమో, అంతకు మించిన అఘాయిత్యానికి పాల్పడటమో చోటు చేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలి కాలంలో తరచూ వెలుగు చూస్తున్న ఈ తరహా ఘటనలు తల్లిదండ్రులు జాగ్రత్త పడాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

వెన్నుతట్టు... చప్పట్లు కొట్టు!



● పిల్లల ఆసక్తులను బలవంతంగా నియంత్రించొద్దు
● అభిరుచుల్ని గుర్తించి ప్రోత్సహిస్తే సత్ఫలితాలు
● సున్నితంగా చెబితే సర్దుకుపోయే అవకాశాలు


తరాలు మారుతున్నాయి. పిల్లల స్వరాలూ మారుతున్నాయి. ఒకప్పుడు తమకు ఇష్టం ఉన్నా.. లేకపోయినా తల్లిదండ్రులు చెప్పిందే వేదంగా భావించేవారు చిన్నారులు. ఫలానా చదువు చదవాలని చెబితే తిరుగుండేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి వేరు. ఒకప్పటిలా తమ అభిరుచులను వారిపై రుద్దాలనుకునే ప్రయత్నాలు చాలా వరకు బెడిసి కొడుతున్నాయి. తమకు ఇష్టం లేకుంటే నిర్ద్వంద్వంగా తోసిపుచ్చేందుకు వెనకాడటం లేదు. తాము ఎంచుకున్న మార్గంలో వెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఆ మార్గం సరికాదని తల్లిదండ్రులు వారిస్తున్నా వినకుండా మొండికేస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఈక్రమంలో బాలల్ని సరైన మార్గంలో నడిపించే విషయంలో తల్లిదండ్రులు సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరం కనిపిస్తోంది. వాస్తవానికి పిల్లల ఆసక్తిని, అభిరుచిని గుర్తించి ప్రోత్సహిస్తే సత్ఫలితాలకు అవకాశముంటుంది. ఇందుకోసం నిపుణులతో ఆప్టిట్యూడ్ టెస్ట్(అభిరుచి పరీక్ష) నిర్వహించి చిన్నారుల సామర్థ్యాలను అంచనా వేయొచ్చు. ఏ రంగంలో ముందుకెళ్తే రాణించేందుకు అవకాశముంటుందో ఆ పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. చాలా సందర్భాల్లో ఇది జరగకపోవడం అనర్థాలకు దారి తీస్తుంది. తాము చెప్పిన మార్గంలో వెళ్లేందుకు నిరాకరిస్తున్నారనే ఆవేశంతో తల్లిదండ్రులు.. తమ ఆసక్తికి పెద్దలు విలువ ఇవ్వడం లేదనే ఆందోళనతో పిల్లల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. కొన్నిసార్లు ఈ వైఖరి విషాదాంతమవుతోంది.

రూ.7.5 లక్షలతో అదృశ్యం

మహారాష్ట్రలోని పుణెకు చెందిన విద్యార్థినికి ఫ్యాషన్ డిజైనింగ్‌పై అమితమైన ఆసక్తి. తల్లిదండ్రులకు అది నచ్చకపోవడంతో ససేమిరా అన్నారు. మెడిసిన్ చదవాల్సిందేనని పట్టుబట్టారు. అంతే అమ్మాయి అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఇంట్లో నుంచి రూ. 7.5 లక్షలు తీసుకొని అదృశ్యమైంది. తల్లిదండ్రులు తెలిసిన అధికారి ద్వారా మహేశ్ భగవత్‌ను సంప్రదించి సహాయం కోరారు. ఆయన వివిధ రాష్ట్రాల్లో ఉన్న తన ఇంజినీరింగ్ బ్యాచ్‌మేట్లకు విషయాన్ని తెలిపి సహకారం తీసుకొన్నారు. విద్యార్థిని లోగడ చేసిన అంతర్జాల శోధనలను బట్టి అహ్మదాబాద్‌కు వెళ్లేందుకు సన్నద్ధమైనట్లు గుర్తించారు. షోలాపూర్ నుంచి అహ్మదాబాద్‌కు వెళ్లే రైళ్ల వివరాల గురించి ఆమె శోధించినట్లు తెలుసుకొని పోలీస్ బృందం షోలాపూర్ వెళ్లింది. అక్కడ లాడ్జిలో బస చేసిన ఆమెను పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లారు. ప్రధాని నరేంద్రమోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో అహ్మదాబాద్ పెద్ద నగరం కావడం వల్ల మహిళలకు భద్రత ఉంటుందనే భరోసాతో అక్కడికి వెళ్లి తన అదృష్టం పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నట్లు విద్యార్థిని వెల్లడించింది.

నిఘా అవసరం

ప్రస్తుత కాలంలో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు అంతర్జాలం, ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగంపై విపరీతంగా అవగాహన పెంచుకుంటున్నారు. వాటి వల్ల చదువుతోపాటు కెరీర్ విషయంలో చాలా విషయాల్నే సంగ్రహిస్తున్నా.. పెడదారిలో పయనించేందుకూ అవి దోహదం చేస్తున్నాయి. తాజాగా 'బ్లూవేల్' భూతం వణికిస్తున్న నేపథ్యంలో పిల్లల కదలికలపై నిఘా విస్తృతంగా ఉంచాల్సిన అవసరమేర్పడింది. విజ్ఞానాన్ని పెంచుకోవడంలో అంతర్జాలాన్ని వినియోగించుకోవడం తప్పనిసరే అయినా అది పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. అందుకే పిల్లలు అంతర్జాలంలో ఏఏ అంశాలను శోధిస్తున్నారని ఓ కంట కనిపెట్టడం అవశ్యంగా మారింది.



ఆశయం పైలట్ .. ఐఐటీ శిక్షణ

మహారాష్ట్ర ఉస్మానాబాద్‌కు చెందిన విద్యార్థిని ఒకరు ఇంటర్‌తోపాటు ఐఐటీ శిక్షణ కోసం గతంలో నగరానికి వచ్చింది. దీపావళి సెలవుల సమయంలో ఆమె ఇంటికి వెళ్లలేదు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు తమకు గతంలో పరిచయమున్న రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్‌ను సంప్రదించారు. ఆయన సూచన మేరకు నల్లకుంట ఠాణాలో అదృశ్యం కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో విద్యార్థినికి ఐఐటీ శిక్షణ తీసుకోవడం ఇష్టం లేకున్నా తల్లిదండ్రుల బలవంతంపై నగరానికి వచ్చినట్లు తేలింది. ఆమెకు పైలట్ కావాలనే కోరిక అమితంగా ఉన్నట్లు గుర్తించారు. ఆమె అదృశ్యమైన రెండు రోజుల తర్వాత బెంగళూరులోని ఓ ఏటీఎం నుంచి డబ్బు డ్రా చేసినట్లు వెల్లడైంది. పోలీస్ బృందం అక్కడికెళ్లి సీసీ పుటేజీలను పరిశీలించినా ఫలితం లేకపోయింది. మైసూరులో పైలట్ శిక్షణ కేంద్రం ఉండటంతో అక్కడా ఆరా తీసినా ప్రయోజనం కనిపించలేదు. నాలుగు నెలల వరకు ఆమె ఆచూకీపై ఉత్కంఠ కొనసాగింది. అనంతరం ఆమె ఫేస్‌బుక్ ఖాతాను తిరిగి తెరవడంతో కొన్ని ఆధారాలు లభించాయి. ఆదిశగా దర్యాప్తు కొనసాగించి గోవాలోని ఓ మారుమూల హోటల్‌లో పని చేస్తున్న ఆమె ఆచూకీ కనుగొన్నారు. పైలట్ శిక్షణ కోసం చేతిలో డబ్బుల్లేక పోవడంతో పూట గడిచేందుకు అక్కడ పని చేస్తున్నట్లు తేలింది.

ఆ పద్ధతి కీలకం

తల్లిదండ్రులు తమ పిల్లల బాగునే కాంక్షిస్తారు. బిడ్డలు నలుగురిలో గుర్తింపు తెచ్చుకుంటే పొంగిపోతారు. ఆ క్రమంలో ఆసక్తిని, అభిరుచిని గౌరవించే విషయానికొచ్చేసరికే తేడాలొస్తున్నాయి. తాము సూచించిన కోర్సులోనే చేరాలంటూ పెద్దలు హుకుం జారీ చేస్తున్నారు. ఒత్తిడి తట్టుకోలేక బాలలు ఇల్లు వదిలి పారిపోవడమో.. లేదంటే ఏకంగా ప్రాణాలనే తీసుకుంటున్నారు. అప్పటికి గానీ తమ ఆశల దీపం ఆరిపోయిందని పెద్దలు గ్రహించలేకపోతున్నారు. గతంలో తాము పడ్డ కష్టాలు బిడ్డలు పడకూడదనే ఉద్దేశంతో ఉన్నత చదువులు చెప్పించాలనుకోడంలో తప్పు లేకపోయినా.. ఆసక్తిని గుర్తించడంలో మాత్రం తప్పటడుగులే పడుతున్నాయని ఇటీవలి ఘటనలు రుజువు చేస్తున్నాయి. పిల్లల అభిరుచులు చాలా సందర్భాల్లో సరైనవి కాకపోవచ్చు. ఏదో అంశంపై ఆసక్తిని పెంచుకొని సరైన దారిని ఎంచుకోవడంలో పొరపడి ఉండొచ్చు. అలాంటపుడే పెద్దలు జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎంచుకోబోయే దారి సరైనది కాదని సున్నితంగా వారికి అర్థమయ్యేలా చెప్పగలగాలి. తాము సూచించిన దారిలో భవిష్యత్తు ఎంత ఉజ్వలంగా ఉంటుందో చాటాలి. నిపుణులతో కౌన్సెలింగ్ చేయించాలి. అలా చేస్తే అధిక శాతం పిల్లలు తప్పకుండా మారే అవకాశముంటుంది. మొండిగా పిల్లల ఆసక్తిని తుంచివేసే ప్రయత్నం చేస్తే దుష్పరిణామాలు పొంచి ఉంటాయి. తాజాగా కుషాయిగూడకు చెందిన సాయిసుజన్ తన క్రికెట్ ఆసక్తిని అంగీకరించరేమో అనే అనుమానంతో ముంబయికి పారిపోయాడు. రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేయించడంతో 70 రోజుల తర్వాత అతడి ఆచూకీ కనిపెట్టగలిగారు.



సామర్థ్య పరీక్షతో భవిత ఉజ్వలం

- మహేశ్ భగవత్, రాచకొండ కమిషనర్

ఇటీవలికాలంలో వెలుగుచూస్తున్న పలు ఘటనలు తల్లిదండ్రులు, పిల్లల మధ్య అంతరాల్ని స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయంలో తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల ఆసక్తిని, అభిరుచిని గుర్తించి ప్రోత్సహించడమే కీలకం. ప్రొఫెషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ చేయించడం వల్ల అది సాధ్యమవుతుంది. అలా చేయడమే ఉభయకుశలోపరిగా ఉంటుంది.



పర్యావరణ మిత్రుడికే ప్రథమ స్థానం

● క్లే గణేశ్ సొసైటీ ఆధ్వర్యంలో లక్ష మట్టి ప్రతిమలు సిద్ధం
● రసాయన విగ్రహాలకు క్రమేణా చరమగీతం

న్యూస్‌టుడే, మొయినాబాద్

'పర్యావరణానికి ప్రతికూలమైన హానికారక రసాయనాలకు చరమగీతం పడుతోంది. పెనుభూతమై పీడిస్తున్న కాలుష్యం నుంచి ప్రకృతిని కాపాడేందుకు 'క్లే గణేష్ సొసైటీ' చర్యలు చేపట్టింది. శివారులో ఈసారి లక్ష మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి విక్రయానికి సిద్ధం చేసింది. ఏటా మట్టి బొమ్మలనే కొలవాలని ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు చేసిన ప్రచారానికి మంచి స్పందన లభిస్తోంది. మూడేళ్లుగా క్లే గణేష్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి గణపయ్యల తయారీ ప్రారంభమైనప్పటికీ.. ఈసారి భారీ సంఖ్యలో గణపతులను అందుబాటులోకి తెచ్చింది. చెరువులు, కుంటల్లో లభించే బంకమట్టితో వివిధ ఆకృతుల్లో రూపొందిన బొజ్జ గణపయ్యలు సుందరంగా కన్పిస్తున్నారు'.

మూడేళ్ల క్రితం మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌కి చెందిన కుమ్మరి మంజుల క్లే గణేష్ సొసైటీకి శ్రీకారం చుట్టారు. నేడు శివారుల్లోని వివిధ ప్రాంతాల్లో 40 కుటుంబాల వారు సొసైటీ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల తయారీలో నిమగ్నమయ్యారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, కాలుష్య నియంత్రణ మండలి, ఎన్జీవోలకు ఈసారి కనీసం 25 వేల ప్రతిమలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంగుళం ఎత్తు నుంచి 8 అడుగుల ఎత్తులో మట్టి వినాయకులను సిద్ధం చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే వినాయకులకంటే.. మట్టి ప్రతిమల ధరల్లో భారీ తేడా ఉంది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో 8 అడుగుల ఎత్తులో తయారు చేసే విగ్రహాలకు రూ.35 వేలకు పైగా ధరలు చెపుతుండగా.. మట్టివి మాత్రం తక్కువ ధరలకే లభిస్తుండటం విశేషం. దీంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల కొనుగోళ్లు క్రమేణా తగ్గుతున్నాయి.

పలు కేంద్రాల్లో అందుబాటులో..

శివారుల్లోని నార్సింగి, గండిపేట, శంషాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, శామీర్‌పేట, మహేశ్వరం, సరూర్‌నగర్, బాలానగర్, జీడిమెట్ల, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఇప్పటికే మట్టి ప్రతిమలు అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వ సహకారం అవసరం

- కుమ్మరి మంజుల, క్లే గణేష్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు

రసాయనాలతో తయారు చేసే ప్రతిమలను ప్రభుత్వం పూర్తిగా నిషేధించాలి. కుల వృత్తులకు మరింత ప్రోత్సాహం అందించాలి. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి. క్లే గణేష్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి వినాయక విగ్రహాలకు మంచి స్పందన వస్తోంది.

తయారీ.. తరలింపు



మట్టి విగ్రహాల తయారీలో సిబ్బంది



సొసైటీ రూపుదిద్దిన విగ్రహాలు



ప్రతిమను తీసుకెళుతున్న యువకులు



కారులో తరలుతున్న మట్టి గణేశుడు

జల క్రీడ




ఇదో చిత్రం.. జల విచిత్రం.. ప్రతి బిందువు లోనూ క్రీడాకృతి ఆవిష్కృతమై కెమెరా కంటికి చిక్కింది. ఓ క్రికెటర్ బ్యాటింగ్ విన్యాసంతో బంతిని బౌండరీకి తరలిస్తున్నట్లుగా ఏర్పడింది. ఇంతకీ ఈ విన్యాసం ఎక్కడిదంటే.. కూకట్‌పల్లిలో రోడ్డు పక్కన ఉన్న ఓ మ్యాన్‌హోల్ నుంచి లీకయి ఎగసిపడిన తాగు నీటిది

ఆకట్టే ఇంద్ర ధనుస్సు.. పులకించె మనస్సు..



నగరంలో మంగళవారం వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. సాయంత్రం ఆకాశం మేఘావృతమైంది. అక్కడక్కడ చిరుజల్లులూ పడ్డాయి. ఇంతలో వినువీధిలో విభిన్న వర్ణాలతో కూడిన ఇంద్ర ధనుస్సు ఆకృతి దాల్చింది. చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. నల్లకుంట ప్రాంతంలో 'న్యూస్‌టుడే' తీసిన చిత్రమిది

సీతాకోక అందాలు



ఉప్పల్ ధర్మపురి కాలనీలో మా ఇంటికొచ్చిన అందమైన సీతాకోక చిలుక. మిలిటరీ యూనిఫామ్‌తో కనిపించి అందరినీ ఆకట్టుకుంది. -వెంకటేశ్, ధర్మపురి కాలనీ

గజరాజుల సోయగం



అమ్మో... ఇదేమిటి ఇన్ని ఏనుగులు బారులు తీరాయని అనుకొంటున్నారా? ఇవన్నీ బొమ్మలు. నగరంలో గణపతుల మండపాల వద్ద ఉంచేందుకు, ఊరేగింపులో ఆకర్షణీయంగా కనిపించేందుకు వీటిని తయారు చేసి ట్రాలీలపై సిద్ధంగా ఉంచారు. నల్లకుంటలో రహదారి పక్కన ప్రదర్శనకు ఉంచారు.

– శంకు, బాగ్‌అంబర్‌పేట; సోని చేతన్, పద్మకాలనీ, నల్లకుంట



వావ్... ఉస్మా'నయా'

న్యాక్ బృందం పర్యటన సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన సూచికల బోర్డులివి. -పి.కిరణ్, ఓయూ



వృథా.. మంచినీటి వృథ

జీడిమెట్ల పారిశ్రామిక వాడలో పైపులైన్ నుంచి కొన్ని రోజులుగా వృథాగా పోతున్న మంచి నీరు.

–సంపత్ మేకల, సూరారం

పౌర పాత్రికేయం

మీ చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న అంశాలను, విభిన్నమైన చిత్రాలను క్లిక్ మనిపించారా? వాటిని మీ పేరు, ప్రాంతం తదితర వివరాలతో మీరూ 'ఈనాడు'కు పంపొచ్చు.

వాట్సాప్ నంబరు: 8008001763

మెయిల్: hydcitydesk@eenadu.in


షెల్టర్ రూపు మారుతోంది!



వనస్థలిపురం విష్ణు థియేటర్ వద్ద ఉండే బస్ షెల్టర్ ఇది. ఎత్తులో ఉండటం... ఎక్కేందుకు దిగేందుకు ఏర్పాట్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. సమస్య అధికారుల దృష్టికి రావడంతో మెట్లు ఏర్పాటు చేస్తున్నారు.

– టీజీ రావు, వనస్థలిపురం

చిత్రం.. సాహసం



బేగంపేట-ఐటీసీ గ్రాండ్ హోటల్ మధ్య ట్రాఫిక్ స్తంభించింది. దానిని చిత్రీకరించేందుకు ఓ ఫొటోగ్రాఫర్ కష్టం. –సీహెచ్‌వీ నగేశ్, నిజాంపేటరోడ్

అధికారులూ.. కాస్త చూడండి



సైదాబాద్ భరత్ గార్డెన్స్ వద్ద ఉన్న పార్కు ఇది. సరైన నిర్వహణ లేక కుక్కలు, గేదెలు తిరుగుతున్నాయి. వాచ్‌మెన్ ఉన్నా శ్రద్ధ లేదు. వాకింగ్ ట్రాక్ ఉంది. కానీ వీటివల్ల నడిచేందుకు వీలుకాదు. – నాగమల్లిక లింగమనేని, సైదాబాద్

హరిత నిర్లక్ష్యం



హబ్సిగూడ ప్రధాన రహదారిలో హరిత హారం మొక్కల్ని నాటకుండా ఇలా వృథాగా పడేశారు. -విజయ్ రాజ్‌కుమార్, హబ్సిగూడ

అవగాహన పెంపుతో రాణింపు



విజేతలకు జ్ఞాపిక, ప్రశంసపత్రాలు అందిస్తున్న హనుమంతరాజు, వెంకటరమణ

రహ్మత్‌నగర్: వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవడంతోనే రాణించే వీలుందని ఐసీఎస్ఐ మాజీ అధ్యక్షుడు దాట్లా హనుమంతరాజు అన్నారు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టులోని నిమ్స్‌మే ప్రాంగణంలో ఐసీఎస్ఐ 17వ అఖిల భారత కంపెనీ లా క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన క్విజ్ పోటీల అనంతరం నాలుగు రిజియన్ల ఫైనల్ పోటీని నిర్వహించారు. ఎన్ఐఆర్‌సీ, డబ్ల్యూఐఆర్‌సీ, ఈఐఆర్‌సీ, ఎస్ఐఆర్‌సీ జోన్ల నుంచి ప్రతినిధులు క్విజ్‌లో పోటీపడ్డారు. వీరిలో ఎస్ఐఆర్‌సీ ప్రతినిధులు విజేతలుగా నిలిచారు. కంపెనీల నిర్వహణలో న్యాయ సంబంధమైన విషయాలపై సెక్రటరీలకు పూర్తి అవగాహన పెంపొందించే ఇలాంటి క్విజ్ కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. కంపెనీల వ్యవహారాలను సమర్థంగా నిర్వహించేందుకు సెక్రటరీలు వివిధ అంశాలపై పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో చాప్టర్ ఛైర్మన్ ఆర్.వెంకటరమణ, హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షుడు ఐసాక్ రాజ్, కార్యదర్శి రాహుల్‌జైన్, ఉపాధ్యక్షురాలు కవితారాణి, క్విజ్ మాస్టర్లు సుధీర్‌కుమార్, సురేష్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన కంపెనీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఒంటెలు, గోవుల అక్రమ రవాణా

హైదరాబాద్: నగరంలో ఒంటెలు, గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. జంతు సంరక్షణ చట్టం ప్రకారం అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టింది. పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులతో పోలీస్ అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. అనంతరం కొత్వాల్ మహేందర్‌రెడ్డి పోలీస్ కమిషనరేట్‌తో జోనల్ డీసీపీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఒంటెలు, గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మొత్తం 11 చోట్ల తాత్కాలిక చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ, పోలీస్, పశుసంవర్ధకశాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించాలన్నారు. గోవులు, ఒంటెల వయస్సును నిర్ధారించేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు, ఆరోగ్య పరిస్థితులను పరీక్షించేందుకు జీహెచ్ఎంసీ వెటర్నటీ విభాగం అధికారులుండాలని కోరారు. గణేష్ నిమజ్జనం-బక్రీద్ పండుగ నేపథ్యంలో ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పాతబస్తీలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ముందుగా బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు డీసీపీ సత్యనారాయణ తెలిపారు.

దాంపత్య బంధాలకు తూట్లు

రెండు వేర్వేరు కేసుల్లో ఐదుగురు అరెస్టు

మల్కాజిగిరి: నూరేళ్లపాటు పండంటి జీవితాన్ని సుఖసంతోషాలతో గడపాల్సిన వారు క్షణికమైన సుఖాల కోసం విలువైన బంధాలను విచ్ఛిన్నం చేసుకున్నారు. భార్యను భర్త, భర్తను భార్య మోసం చేసిన రెండు వేర్వేరు ఘటనల్లో ఐదుగురిని మంగళవారం మల్కాజిగిరి పోలీసు అరెస్టయ్యారు.

వరసలనే మర్చిపోయారు.. ఎస్సై జేమ్సుబాబు కథనం ప్రకారం.. ఉప్పరిగూడలో నివసించే లఖన్, భవానీ (26) భార్యాభర్తలు. గతనెల 28న భవానీ అదృశ్యమవ్వటంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసును విచారిస్తున్న పోలీసులకు కొద్దిరోజుల తరువాత వీరి సమాచారం తెల్సింది. లఖన్ సోదరుడైన ఆర్.రాహుల్ (24) భవానీ యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. వివాహానికి రాహుల్ తల్లి అనీత (40), తమ్ముడు వికాస్ హాజరయ్యారు. భర్త నుంచి విడాకులు తీసుకోకుండా వివాహం చేసుకున్నందుకు భవానీ, రాహుల్, అతని తల్లి, తమ్ములపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భార్యను మోసం చేసిన ఘనుడు.. తుకారాంగేట్‌లో నివసించే వి.సుధాకర్ (29), నవీన భార్యాభర్తలు. వీరికి ఏడాది క్రితం వివాహమైంది. సుధాకర్‌కు ఓ అవివాహిత (29)తో మూడేళ్ల క్రితం పరిచయమేర్పడింది. ఇటీవల ఆమె సుధాకర్‌ను గత ఆదివారం దేవాలయంలో వివాహం చేసుకుంది. కూతురు కనిపించడం లేదంటూ వివాహిత తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాహం విషయం తెలుసుకున్న సుధాకర్ భార్య నవీన భర్తపై మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సుధాకర్‌ను రిమాండ్‌కు తరలించారు.

అధికారులు వేధిస్తున్నారని మహిళా ఉద్యోగి బైఠాయింపు



గీతాదేవి

గన్‌ఫౌండ్రి: తన కళాశాలలో పని చేస్తున్న ప్రిన్సిపల్‌తో ఇంటర్మీడియట్ బోర్డులో పని చేస్తున్న కొంత మంది ఉద్యోగులు తనను వేధింపులకు గురి చేస్తున్నారని, వాటిని నివారించాలని కోరుతూ ఓ మహిళా ఉద్యోగి నాంపల్లిలోని ఇంటర్మీడియెట్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన గీతాదేవి నాంపల్లిలోని మౌలానా అబుల్ కలామ్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్నారని తెలిపారు. కాగా తమ కళాశాల ప్రిన్సిపల్ తనను వేధిస్తున్నారని ఆరోపించారు. రిజిస్టర్‌లో సంతకం చేయనీయడం లేదన్నారు. సర్వీస్ బుక్‌ను క్రమబద్ధీకరించడం లేదని.. పీఆర్‌సీ వర్తింప చేయలేదని ఆమె ఆరోపిస్తున్నారు. బోర్డు కార్యాలయంలో కొందరు అధికారులు, ఓ సంఘం నేత తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. తనకు న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఇది నగర లెక్క...

9,49,605
- టీకాలకు అర్హులైన పిల్లలు (9 నెలలు- 15 ఏళ్లు మధ్య)

3,600
- నగరంలో పాఠశాలలు

710
- టీకాలు ఇప్పించిన పాఠశాలలు

2 లక్షలు
- తీసుకున్న చిన్నారులు



టీకాలపై ప్రైవేటు..!

చిన్నారుల ప్రాణాలను కాపాడే ఎంతో విలువైన టీకాలను వారికి దక్కకుండా కొన్ని ప్రైవేటు పాఠశాలలు మోకాలడ్డుతున్నాయి. టీకాలు ఇచ్చేందుకు పాఠశాలల వద్దకు వెళుతున్న వైద్య ఆరోగ్య సిబ్బందిని తమకు అవసరం లేదంటూ తిప్పిపంపుతున్నారు. తల్లిదండ్రులు అనుమతి తెలపడం లేదంటూ కుంటి సాకులు చెప్పి గేట్లు బంద్ పెడుతున్నారు. చేసేది లేక సిబ్బంది వెనుకడుగు వేస్తున్నారు. కనీస అవగాహన లేక నగరంలో చాలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు జాతీయ టీకా కార్యక్రమానికి ఉద్దేశం పూర్వకంగానే తూట్లు పొడుస్తున్నాయి.

- వైద్య సిబ్బందిని తిప్పిపంపుతున్న పాఠశాల యాజమాన్యాలు
- ప్రైవేటు పాఠశాలల్లో చదివే చిన్నారులు టీకాలకు దూరం
- తట్టు, పొంగు వ్యాధుల నుంచి రక్షణేదీ..?

ఈనాడు, హైదరాబాద్

ప్రభుత్వ, ప్రైవేటు కలిపి ఇప్పటివరకు నగరంలో 3600 పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 9.49 లక్షల మంది పిల్లలను గుర్తించారు. ఇప్పటివరకు కేవలం 710 స్కూళ్లలో 2 లక్షల మంది పిల్లలకు మాత్రమే అందించారు. నిత్యం 4-5 ప్రైవేటు పాఠశాలలు టీకాలు తీసుకునేందుకు నిరాకరిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రాణాంతక తట్టు, రుబెల్లా వ్యాధులకు ఈ నెల 17 నుంచి ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తున్న సంగతి తెలిసిందే. తొలి విడతలో నగర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు ఈ టీకాలు ఇప్పించాలని నిర్ణయించారు. ఇంతవరకు ఈ టీకాలు ప్రస్తుతం ప్రైవేటులో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇటీవలి కేంద్రం సార్వత్రిక టీకా కార్యక్రమంలో తట్టు, రుబెల్లాను(ఎంఎంఆర్/ఎంఆర్)ను చేర్చడంతో నగరంలోని పిల్లలకు అందుబాటులోకి వచ్చింది. నిజంగా చిన్నారులకు ఇదో వరమనే చెప్పాలి. ఇప్పటికే 120 దేశాల్లో అక్కడ ప్రభుత్వాలు జాతీయ సార్వత్రిక టీకా కార్యక్రమం ద్వారా అక్కడ పిల్లలకు తట్టు, రుబెల్లాను అందిస్తున్నాయి. పేదలకు సరైన అవగాహన లేకపోవడం, ఆర్థిక పరమైన ఇబ్బందులతో చాలామంది చిన్నారులు ఈ టీకాలకు దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఎంతోమంది చిన్నారులు ఈ జబ్బుల బారిన పడి మృతి చెందుతున్నారు.

ప్రాణాంతక జబ్బుల నుంచి రక్షణ...

ముఖ్యంగా తట్టుతో చిన్నారుల్లో నిమోనియా, విరోచనాలు, మెదడువాపు లక్షణాలు కన్పించి ఒక్కోసారి ప్రాణాంతకం అవుతోంది. దగ్గడం, తుమ్మడం ద్వారా మరొకరికి ఈ వ్యాధి సోకుతుంది. గర్భంతో ఉన్న మహిళకు రుబెల్లా సోకితే ఇది పుట్టబోయే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా పుట్టబోయే బిడ్డకు కంటిలోపాలు వస్తాయి. శుక్లం లేదంటే నీటికాసు లాంటి సమస్యలు తలెత్తుతాయి. ఇవేకాక వినికిడి లోపం, మెదడు, గుండె సంబంధిత లోపాలు ఏర్పడతాయి. కొన్ని సందర్భాల్లో గర్భస్రావం, మృత శిశువు పుట్టడం లాంటి పరిస్థితులు ఏర్పడతాయి. ఇలాంటి వ్యాధులను నివారించే ఉద్దేశంతో కేంద్రం సార్వత్రిక టీకా కార్యక్రమంలో వీటిని చేర్చి పిల్లలకు అందించాలని నిర్ణయించారు. నగరంలో పలు పాఠశాల తీరుతో ఆదిలోనే హంస పాదు ఎదురవుతోంది. టీకా వేస్తే పిల్లలకు జ్వరం వస్తుందని.. ఇలా లేని పోని అపోహలు సృష్టించి దూరం పెడుతున్నారని వైద్య ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. కొన్ని పాఠశాలలు కనీసం గేటు లోపల వరకు కూడా అనుమతించడం లేదని వాపోతున్నారు. పేరున్న పాఠశాలలు కూడా అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నాయని చెబుతున్నారు.



నిర్భయంగా ఇప్పించవచ్చు

– డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణులు

తట్టు, రుబెల్లా టీకాలు ఎంతో కీలకమైనవి. మన దేశంలో చిన్న పిల్లల మరణాలకు ఈ రెండు వ్యాధులు ఎక్కువ కారణం. జాతీయ టీకా కార్యక్రమంలో వీటిని చేర్చడంలో ఇప్పటికే ఆలస్యమైంది. టీకాలు ఇప్పటికే ప్రైవేటు ఆసుపత్రిలో ఇప్పించిన సరే.. మరోసారి అందించాలి. తట్టు, రుబెల్లా దేశం నుంచి పోవాలంటే అందరికి ఒకటేసారి ఇవ్వాలి. అప్పుడే పూర్తిగా నివారించవచ్చు. ప్రతి ఒక్కరు నిర్మాణాత్మకంగా ఆలోచించాలి. ఎలాంటి అపోహలు అవసరం లేదు. కేవలం భ్రమ...భ్రాంతి...భయంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. వంద మందికి ఇస్తే ఒకరిద్దరి పిల్లలకు జ్వరం రావచ్చు. అంత మాత్రాన ఏమీ కాదు. ఎంతో సదుద్దేశంతో కార్యక్రమం ప్రవేశ పెట్టారు. టీకాలు తీసుకోవడం ఎలాంటి ఇబ్బంది నష్టం లేదు. వాటిని నిరాకరించడం సరికాదు. టీకాలతో అనేక రోగాలను అడ్డుకోవచ్చు.

ఈ విషయం మా దృష్టికి వచ్చింది...

–డాక్టర్ జయమాల, డీఐవో, హైదరాబాద్

కొన్ని ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు టీకాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. టీకాలు తీసుకోవడం వల్ల చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఒకరిద్దరికి జ్వరం వచ్చిన అది వెంటనే తగ్గిపోతుంది. దాని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలు అందరికి ఈ టీకాలు ఇప్పించాలి. తొలి విడతలో అన్ని పాఠశాలల్లో అందిస్తున్నాం. శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్తలు ఈ టీకాలు వేస్తారు. ప్రతి చిన్నారికి వేర్వేరుగా ప్రత్యేక సూదినే వినియోగిస్తారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అపోహలు విడనాడాలి. భావి భారతవనికి చిన్నారులే కీలకం. టీకాలను ఇప్పించడం ద్వారా వారిని మరింత ఆరోగ్యవంతంగా తయారు చేయడం అందరికి కర్తవ్యంగా భావించాలి. టీకాలు నిరాకరించే పాఠశాలలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నాం. మరో పది రోజుల పాటు పాఠశాలల్లో విద్యార్థులకు టీకాలు అందిస్తాం. మిగిలిన పిల్లలకు మూడో వారంలో సమీపంలోని ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించనున్నాం.

నిమ్స్‌లో ఈహెచ్ఎస్ సేవల పరిశీలన

పంజాగుట్ట, న్యూస్‌టుడే: నిమ్స్ ఆసుపత్రిలో ఉద్యోగులకు, పింఛనుదారులకు అందించే ఈహెచ్ఎస్ సేవలను మంగళవారం తెలంగాణ రాష్ట్ర టీఎన్‌జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, హైదరాబాద్ నగర అధ్యక్షుడు ప్రతాప్ పరిశీలించారు. నిమ్స్ సంచాలకులు డా. కె.మనోహర్‌తో కలిసి నూతనంగా ప్రారంభమైన గదులను సందర్శించారు. ఈహెచ్ఎస్ సేవలు పొందుతున్న వివరాలను ఆరా తీశారు. ఈహెచ్ఎస్ సేవలను మరింత విస్తృతం చేసి ఆ విభాగానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని డైరెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ సంఘం రాష్ట్ర నేతలు, గ్రేటర్ నేతలు మార్త రమేష్, సత్యగౌడ్, పి.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న త్రిపురాన వెంకటరత్నం

మహిళలు వంటింటి కుందేళ్లు కాదు

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్-పర్సన్ త్రిపురాన వెంకటరత్నం

బోడుప్పల్: స్వాతంత్య్రం వచ్చి 70 ఏళ్లు దాటుతున్నా ఇంకా మహిళలను వంటింటి కుందేళ్లుగా భావించడం తగదని, మహిళా హక్కుల సాధనకు పోరాడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్-పర్సన్ త్రిపురాన వెంకటరత్నం పేర్కొన్నారు. ఐద్వా ద్వితీయ మహాసభలను పురస్కరించుకొని మంగళవారం పీర్జాదిగూడ బండీ గార్డెన్‌లో మేడ్చల్ జిల్లా ఐద్వా అధ్యక్షురాలు ఎన్. సృజన నేతృత్వంలో 'మహిళలు, చట్టాలు, ప్రాధాన్యత' అంశాలపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నిచట్టాలు చేస్తున్నా వాటి అమలులో లోపాలే శాపాలుగా మారుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఐద్వా కేంద్ర కమిటీ సభ్యురాలు టి. జ్యోతి మాట్లాడుతూ.. సెప్టెంబరు 2 నుంచి రాష్ట్రంలో అమలుకానున్న మద్యం పాలసీ పట్ల పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్ర ఐద్వా అధ్యక్షురాలు కేఎన్ ఆశాలత, కార్యదర్శి బి.హైమవతి, రాష్ట్రకమిటీ సభ్యురాలు చల్లా లీలావతి, సృజన, వినోద, మేడిపల్లి మండల సీఐటీయూ కార్యదర్శి కె.రంగారెడ్డి పాల్గొన్నారు.



నగరంలోని వీధుల్లో పాత దీపాల స్థానంలో ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. పాతవి ఇలా మూలకు చేరుతున్నాయి. ఉప్పల్‌లో కనిపించిందీ దృశ్యం.

అమెరికన్ ఆంకాలజీలో ఏవోఐ కేంద్రం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: క్యాన్సర్, క్యాన్సర్ రహిత స్కల్ బేస్డ్ ట్యూమర్ల వైద్యచికిత్సకు సమగ్ర సంరక్షణ కేంద్రాన్ని (ఎండోస్కోపిక్ స్కల్ బేస్డ్ సర్జరీ సెంటర్) నగరంలోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏవోఐ)లో ప్రారంభించారు. యూఎస్ఏలోని పిట్స్‌బర్గ్ కేంద్రంగా ఉన్న క్యాన్సర్ ఆసుపత్రుల బృందంతో కలిసి అంతర్జాతీయస్థాయి వైద్యచికిత్సను అందుబాటులోకి తెచ్చినట్లు వైద్యులు తెలిపారు. బంజారాహిల్స్‌లోని హోటల్ తాజ్‌డెక్కన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ మెడికల్ డైరెక్టర్ డా.ఎం.బాబయ్య, శస్త్రచికిత్సా నిపుణులు డా.శశికాంత్ జొన్నలగడ్డ, డా.అజయ్‌రెడ్డి మాట్లాడారు. పురుషులు, మహిళల్లో అన్ని వయస్సుల వారికి క్యాన్సర్, క్యాన్సర్ రహిత పుర్రెకు సంబంధించిన అన్ని రకాల కణితుల చికిత్స కోసం ఏవోఐలో సమగ్ర సంరక్షణ కేంద్రం ప్రారంభించినట్లు వెల్లడించారు. వైద్య విధానాన్ని, చికిత్సా పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ తరహా శస్త్రచికిత్సలు నిర్వహించే వైద్యనిపుణుల బృందం తమవద్ద ఉందన్నారు.

చెట్ల కొమ్మలు నరికివేసే యంత్ర వాహనాలు అవసరం



యంత్రానికి పూజ చేసి కొబ్బరికాయ కొడుతున్న మేయర్ రామ్మోహన్

కవాడిగూడ, న్యూస్‌టుడే: నగరంలో చెట్ల కొమ్మలు నరికి వేసేందుకు యంత్ర వాహనాలు అవసరమని శాసనసభ్యుడు డా.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం ఇందిరాపార్కు వద్ద గుజరాత్ నుంచి తెప్పించిన చెట్ల కొమ్మలు నరికివేసే యంత్ర వాహనం, కొమ్మలను తుక్కుగా మార్చే మరో యంత్రాన్ని మేయర్ బొంతు రామ్మోహన్, ఉప మేయర్ ఫసీయుద్దీన్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగరంలో రోడ్ల పక్కన చెట్లు అడ్డదిడ్డంగా విస్తరించాయన్నారు. వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారిన కొమ్మలను తొలగించాల్సి ఉందన్నారు. 40 అడుగులకుపైగా ఎత్తు పెరిగి గాలులకు పడిపోయేలా ఉన్న చెట్లను గుర్తించి 20 అడుగుల మేరకు నరికివేయాలన్నారు. మహా నగరపాలకసంస్థ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ గుజరాత్ నుంచి తెప్పించిన కొమ్మలు నరికే యంత్ర వాహనం ధర రూ.15 లక్షలని చెప్పారు. నరికిన కొమ్మలను తరలించడం కష్టంగా మారినందున వాటిని తుక్కుగా చేసే యంత్రాన్ని సైతం రూ.2.50 లక్షలతో కొనుగోలు చేశామన్నారు. జోన్‌కు ఒకటి చొప్పున కొనుగోలు చేయాలని అనుకుంటున్నామని చెప్పారు. మేయర్, ఎంఎల్ఏ యంత్ర వాహనంలో 20 అడుగుల ఎత్తుకు వెళ్లి కొమ్మలను నరికి చూశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ బయోడైవర్సిటీ సంచాలకుడు దామోదర్, డిప్యూటీ డైరెక్టర్ నాగిరెడ్డి, ఉద్యాన అధికారి మోయిజుద్దీన్, జీహెచ్ఎంసీ 15 సర్కిల్ ఉప కమిషనర్ కృష్ణశేఖర్, వైద్యాధికారి డా.భార్గవ నారాయణ, భాజపా, తెరాస నాయకులు పాల్గొన్నారు.



కొమ్మలను నరుకుతున్న కార్మికుడు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ చౌదరిగూడేనికి చెందిన నవనీత. విస్తరాకుల వ్యాపారం చేస్తోంది. పొదుపు సంఘంలో తొలివిడతగా రూ.50వేలు రుణంగా పొంది చిన్నగా వ్యాపారం ప్రారంభించింది. మరో రూ.లక్ష రుణంగా తీసుకుని తిరిగి చెల్లిస్తూనే తన వ్యాపారాన్ని విస్తృతం చేసుకుంది. భర్త సహకారంతో పరిగి, కొందుర్గు, షాద్‌నగర్‌లో విక్రయిస్తోంది. తన ఇద్దరు పిల్లలను చదివిస్తూ ఆర్థికంగా కుటుంబాన్ని నిలపెడుతోంది.



చీరల వ్యాపారంలో రాణిస్తున్న ఈమె పేరు కోనేరు పద్మిని. కొందుర్గు మండల కేంద్రం. పొదుపు సంఘంలో పొదుపు చేసి ఏడాది క్రితం రూ.లక్ష పెట్టుబడితో వ్యాపారాన్ని మొదలుపెట్టింది. వ్యాపారం జోరుగా సాగుతుండడంతో క్రమం తప్పకుండా బ్యాంకు రుణాన్ని చెల్లిస్తున్నట్లు చెబుతోంది. రోజుకు రూ.1000 నుంచి 1500 వరకు సంపాదిస్తూ ఉన్నతంగా జీవిస్తున్నట్లు ఆనందం వ్యక్త పరిచింది.



ఈమె పేరు అనూరాధ. నిన్నమొన్నటి వరకు కూలీ పనులు చేసుకునేది. చౌదరిగూడెం మండలంలోని ఇంద్రానగర్‌కు చెందిన ఈమె ప్రస్తుతం మెడికల్ షాపును నిర్వహిస్తోంది. పొదుపు సంఘంలో సభ్యురాలిగా చేరి మెడికల్ దుకాణం పెట్టుకోగలిగింది. తొలివిడత రూ.30వేలు, మలివిడత రూ.50వేలు రుణంగా తీసుకోగా సక్రమంగా చెల్లించినందుకు మరో రూ.లక్ష రుణం అందింది. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని వ్యాపారిగా రాణిస్తోంది. నెలకు రూ.10 నుంచి 15వేలు సంపాదిస్తోంది. ఈమె భర్త ప్రైవేటు ఉద్యోగి. పొదుపు సంఘం తన జీవితాన్నే మార్చిందని చెబుతోంది.

'పొదుపు'లో పరుగు..
ఆర్థికంగా ముందడుగు



- చిరువ్యాపారులుగా రాణిస్తున్న అబలలు
- ఆదర్శవంతంగా నిలుస్తోన్న మహిళా సంఘాలు
- కొందుర్గు, చౌదరిగూడెం సమాఖ్య స్ఫూర్తిగాథ

న్యూస్‌టుడే, కొందుర్గు

వారంతా పొదుపుగా ముందడుగు వేశారు. అప్పుగా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు.. వందలాది మంది గ్రామీణ మహిళలు పొదుపు సంఘాల సభ్యులుగా చేరి వ్యాపారంలో రాణిస్తూ ముమ్ముందుకు దూసుకెళుతున్నారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు, చౌదరిగూడెం మండలాల్లో మహిళా సమాఖ్య సాధించిన విజయమిది. చక్కగా పొదుపు పాటిస్తూ.. వ్యాపార రంగంలో రాణిస్తున్నందుకు రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకుంది.

కొందుర్గు, చౌదరిగూడెం మండలాల్లో కలిపి 920 స్వయం సహాయక సంఘాలు ఉండగా వీటిలో 11,037 మంది మహిళలు పొదుపు చేస్తున్నారు. వీరిలో బ్యాంకు లింకేజీ కింద కొందుర్గులో రూ.1.08కోట్లు, చౌదరిగూడెం మండలంలో రూ.7.96లక్షలు మహిళలు అందుకున్నారు. 705 మంది ఈ రుణాల ద్వారా ఉపాధి వైపు అడుగులు వేశారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు స్త్రీనిధి కింద రూ.40.58 లక్షలు డిపాజిట్ల రూపంలో బ్యాంకుల్లో జమ చేయడం విశేషం. ఇక సూక్ష్మరుణాల కింద రూ.కోటికిపైగా రుణాలు తీసుకున్నారు. మరోవైపు స్త్రీనిధి సాధారణ రుణాల కింద ఇరుమండలాల్లో కలిపి 2056మంది మహిళలకు రూ.2.40కోట్ల రుణాలు అందించారు. ఇక మహిళల పరంగా స్త్రీనిధి కార్పస్ కింద రూ.32లక్షలు జమచేశారు. ఇలా పొదుపు పథంలో పయనిస్తూ కుటుంబాలకు చేదోడు వాదోడుగా నిలుస్తుండటమే కాక తమ కాళ్లపై నిలబడి వ్యాపారాలు సాగిస్తున్నారు. మరోవైపు మహిళా సమాఖ్య ద్వారా మహిళలకు బీమా సదుపాయం, వితంతువులు, వృద్ధులు, వికలాంగులకు పింఛను సదుపాయాలు సమకూరుతున్నాయి.



ఇటీవల సమావేశమైన పొదుపు సంఘాల మహిళలు

ఇవీ విశేషాలు

- పొదుపునకు సంబంధించి జమచేసిన మొత్తమ్మీద ఇచ్చే సాధారణ రుణాలే కాకుండా, నిరుపేద మహిళలకు చేయూతగా పలురకాల పథకాలు సమాఖ్య ద్వారా చేపట్టారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల పథకం ద్వారా కడుపేదరికంలో ఉన్న మహిళలకు శిక్షణ ద్వారా నైపుణ్యాన్ని పెంచి రూ.30వేల నుంచి 50 వేల వరకు వ్యక్తిగత రుణాలు అందజేస్తున్నారు. దీనిద్వారా 12గ్రామ సంఘాలకు చెందిన 17 మందికి లబ్ధి చేకూరింది.
- జాతీయ సమగ్ర నీటి యాజమాన్య పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలకు వ్యవసాయం, కూరగాయల సాగు, కూరగాయల వ్యాపారం, తోటల పెంపకం నిమిత్తం రూ.30 నుంచి రూ.50వేలు వ్యక్తిగత రుణాలను అందిస్తున్నారు. దీని ద్వారా తొమ్మిది మంది మహిళలకు రూ.30వేల చొప్పున రుణాలు అందించారు.
- టీఎస్‌పీ కింద ప్రత్యేకంగా గిరిజన మహిళలకు రుణాలు ఇస్తున్నారు. దీనిద్వారా నెలకు రూ.100 చొప్పున ఏడాది పాటు జమచేసే మహిళకు రూ.50 వేలు రుణంగా అందిస్తున్నారు.
- ఎస్సీఎస్‌పిపథకం ద్వారా దళిత మహిళలకు జీవనోపాధి నిమిత్తం రూ.50వేలు రుణంగా అందజేస్తున్నారు. 13 గ్రామ సంఘాలకు చెందిన 130 మంది మహిళలు రుణాలను వినియోగించుకున్నారు.

విస్తృత అవకాశాలు..

స్వయం సహాయక సంఘాలు ఏర్పడ్డాక రెండు మండలాల్లోని గ్రామాల్లో మహిళలు వ్యాపార, వ్యవసాయ, పాడి రంగాల్లో రాణిస్తున్నారు. అంది వచ్చిన రుణాలతో పాడిపశువులు, గొర్రెలు, మేకల కొనుగోలు, వ్యవసాయ పెట్టుబడులతో సాగు చేయడం, కిరాణ కొట్లు, హోటళ్ల నిర్వహణ, విస్తరాకుల తయారీ, కొవ్వొత్తుల తయారీ, లేడీస్‌కార్నర్ నిర్వహణ.. ఇలా రకరకాల వ్యాపారాలు చేసుకుంటున్నారు.

నైపుణ్యం పెంచుతున్నాం

– యాదగిరి, ఏపీఎం, మహిళా సమాఖ్య, కొందుర్గు



మహిళలు తమకు ఇష్టమైన రంగంలో రాణించే విధంగా మహిళా సంఘాల ద్వారా వివిధ అంశాలలో శిక్షణ ఇస్తున్నాం. రుణ రికవరీలు నూటికి నూరుశాతం ఉంది. మహిళలు రూ.65లక్షలు పొదుపు సంఘాలలో డిపాజిట్ చేశారు. దీనికి వారికి నెలకు రూ.42వేలు వడ్డీ వస్తుంది. దానిని కూడా వారి ఖాతాల్లోనే జమచేస్తున్నాం. అలాగే 1250 మంది విద్యార్థులకు ఏడాదికి రూ.1200 చొప్పున ఉపకార వేతనాలు అందిస్తున్నారు.



ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న అధ్యాపకులు

ఏడో యూజీసీ వేతన సవరణ అమలు చేయాలి

పంజాగుట్ట, న్యూస్‌టుడే: అధ్యాపక సంఘాలతో సంప్రదించి ఏడో యూజీసీ వేతన సవరణ సంఘం సిఫారసులను త్వరితగతిన అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ చింతలబస్తీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోధన సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీజీసీజీటీఏ నాయకులు డా.ఈ.యాదయ్య మాట్లాడుతూ ఆరో వేతన స్కేల్‌లోని అవకతవకలను తొలగించాలని కొత్త వేతన స్కేలు అమలులో వందశాతం ఆర్థిక చేయూతను కేంద్రమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు డా.కిషోర్‌కుమార్ పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఒప్పంద అధ్యాపక నాయకులు గిరిధర్ మాట్లాడుతూ వేతన స్కేల్‌ను కాంట్రాక్ట్, గెస్ట్ అధ్యాపకులకు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గీతాలక్ష్మీ పట్నాయక్, డా.కె.ప్రవీణ్‌కుమార్, డా.సూర్య నారాయణ, డా.మధుసూదన్, డా.భారతి, రాధిక, మునుస్వామీ జేఏసీ నాయకులు మహేష్ పాల్గొన్నారు.





పుస్తకాల సంచి బరువు మోయలేక చిన్నారులు పడుతున్న కష్టానికి నిదర్శనమీ చిత్రం. నారాయణ గూడలో ఓ విద్యార్థిని బ్యాగు బరువుతో పాట్లు పడింది.

వంద శాతం అక్షరాస్యతే ధ్యేయం: ఉపసంచాలకులు నాగలక్ష్మి

విజయనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: వంద శాతం అక్షరాస్యత సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని జిల్లా వయోజన విద్య ఉప సంచాలకులు, జనశిక్షణ సంస్థాన్ ఛైర్మన్ వి.నాగలక్ష్మి అన్నారు. మంగళవారం విజయనగర్‌కాలనీలోని జేఎస్‌ఎస్ కార్యాలయంలో జిల్లాలోని 16 మండలాల సమన్వయకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగలక్ష్మి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే చాలు వయసుతో నిమిత్తం లేకుండా చదువులు సాగించి మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. ముఖ్యంగా పేదలు నివసించే బస్తీలు, మురికివాడలపై దృష్టి సారించి సత్ఫలితాలు సాధించాలని సమన్వయకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు కాత్యాయిని, జేఎస్‌ఎస్ డైరెక్టర్ ఎ.మాణయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జి ధరించి నిరసన తెలుపుతున్న సిటి కాలేజ్ అధ్యాపకులు

కేంద్ర ప్రభుత్వమే వంద శాతం జీతాలు భరించాలి

లెక్చరర్ అసోషియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్

జహనుమా, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుల జీతాల వ్యయం కేంద్ర ప్రభుత్వమే వంద శాతం భరించాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్ డిమాండ్ చేసింది. ఈ సంస్థ పిలుపు మేరకు వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, టీజీసీటీఏ ఉద్యోగ సంఘాలకు చెందిన అధ్యాపకులు చొక్కాలకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ సిటీ కాలేజ్ ప్రధాన గేటు ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనిల్‌కుమార్, రవిప్రసాద్, డా.రత్నాప్రభాకర్, సౌజన్య, స్వప్రభా పాండా, శ్రీలత, డా.చిన్నాబాబు, సుచిత్రసింగ్, రాజేష్‌కుమార్, డా.వెంకటేశ్వర్‌రావు, జయమ్మతోపాటు ఇతర అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.